నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 16 మార్చి 2024 | www.navatelangana.com

గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకుల అరెస్ట్

నవతెలంగాణ-వర్గల్



గంజాయి అమ్ముతున్న ఇద్దరి యువకులను గౌరారం పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గజ్వెల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, గౌరారం ఎస్సై శివకుమార్‌లు మాట్లాడుతూ వర్గల్ గ్రామానికి చెందిన దిండి శివానంద్ (20), సాయి కిరణ్ (20) ఇద్దరు యువకులు గత కొద్దికాలంగా గంజాయి వినియోగిస్తూ, ఇతర యువకులకు, కార్మికులకు గంజాయిని అమ్ముతున్నారు. గురువారం అవుసులోనిపల్లి పల్లెప్రకృతివనంలో రెండు ద్విచక్రవాహనాలపై అనుమానస్థితిలో కనిపించగా పోలీసులు వారి వాహనాలను తనిఖీ చేశారు. రెండు వాహనాల్లో 130 గ్రాముల గంజాయి లభించింది. గత కొద్ది రోజులుగా నానక్ రామ్ గూడాలోని నీతూ భాయ్ వద్ద గంజాయిని విక్రయిస్తున్నారని తెలిపారు. ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. యువత మత్తు జోలికి పోవద్దని సూచించారు. ఎవరైనా గంజాయికి సంబంధించిన క్రయ విక్రయాలు జరిపితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నర్సాపూర్



పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నర్సాపూర్ నియోజకవర్గంలో బీవీఆర్ ఐటి ఇంజినీరింగ్ కళాశాల లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంలను శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం బీవీఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంలను పరిశీలించడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం నర్సాపూర్ నియోజకవర్గంలో ఉన్న బీవీఆర్ ఐ టి కళాశాలలో 5 సెగ్మెంట్‌లకు కౌంటింగ్ సెంటర్, ఒక పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సెంటర్‌ను, ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో 2 సెగ్మెంట్‌లకు కౌంటింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కౌంటింగ్ సెంటర్,స్ట్రాంగ్ రూంలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహశీల్దార్ కమలద్రి, బీవీఆర్ ఐటి కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దూబే,ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.

4 నెల్లుగా... జీతాల్లేక వెతలు

- 2006 నుంచి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రతలేదు
- జీయో ట్యాగింగ్ వల్ల సాంకేతిక తిప్పలు
- ఎండల్లో మగ్గుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- కొత్త ప్రభుత్వంలోనూ జీతాలు రాక తిప్పలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పస్తులతో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామీణ ఉపాధి హామీ పథంలో కీలకంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెల్లుగా జీతాల్లేవు. గ్రామీణ పేదలకు ఉపాధి పనులు కల్పిస్తూ పథకం అమల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నా నెల నెలా జీతాలివ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుంది. ఈజీఎస్ పథకంలో కేంద్రం కొత్తగా తెచ్చిన జీయో ట్యాగింగ్ పద్దతి వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. 18 ఏళ్లుగా పని చేస్తున్నా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ఇచ్చే కొద్దిపాటి జీతభత్యాలు కూడా ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రమను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన్నే జీతాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రామీణ పేదలకు పని గ్యారంటీ కల్పిస్తూ 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ ద్వారా పని పొందుతున్నారు. పథకాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కొర్రీలు పెడుతున్నాయి. కూలీలకు నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నాయి. ఇటీవల జియో ట్యాగింగ్ వంటి పద్దతి తేవడం వల్ల కూలీలకే కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లక్షలాది కుటుంబాలకు పని కల్పిస్తూ గ్రామాల్లో సమయపాలనలేకుండా పనులు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం గుర్తించడంలేదు. పథకం ప్రారంభం నుంచీ పనిచేస్తున్నా ఇప్పటికీ ఉద్యోగ భద్రతలేదు. కనీస వేతనం అందని ద్రాక్షలా మారింది. అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు కూడా అధికమయ్యాయి. ఉపాధి హామీ పనులు చేయించేందుకు గ్రామానికో ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1615 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో 1600 మంది వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.

నాలుగు నెల్లుగా జీతాలివ్వట్లే

ఈజీఎస్‌లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెల్లుగా ప్రభుత్వం జీతాలివ్వట్లేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నాలుగు నెల్లుగా జీతాలు రాకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కూలీల సంఖ్యను పెంచాలని అధికారులు టార్గెట్ పెట్టడంతో ఇంటింటికీ తిరిగి కూలీలను పనిలోకి వచ్చేలా చూస్తున్నారు. దీంతో పనులు చేసే వాళ్ల సంఖ్య పెరిగుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు నెల నెలా ఒకటో తేదీన్నే జీతాలు వేస్తున్న ప్రభుత్వం కష్టపడి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రం నాలుగు నెల్లుగా జీతాలివ్వట్లేదు. పెరుగుతున్న ధరల వల్ల ఇచ్చే కొద్దిపాటి జీతం చాలని పరిస్థితి ఉంది. అది కూడా నెల నెలా చేతికందకపోతే కుటుంబాల్ని పోషించేది ఎట్ల అని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రశ్నిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తమ కుటుంబ పోషణ కోసం సమబావన సంఘాలు, ఇతర సంస్థల్లో అప్పులు చేస్తున్నారు. నాలుగు నెల్లుగా జీతాలివ్వకపోవడంతో తీసుకున్న అప్పులకు ఈఎంఐలు కట్టడానికి డబ్బుల్లేక ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి అప్పులు కట్టాల్సి వస్తుందని పలువురు పీఎలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.26 వేల కనీస వేతనం అందని ద్రాక్ష

ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఒక్కో గ్రామంలో వందలాది మంది కూలీలకు రోజువారిగా పనులు కల్పిస్తున్నారు. ఈజీఎస్ కింద పనిచేసేలా వాళ్లను ప్రోత్సహించేందుకు వాళ్ల ఇంటికెళ్లి పనులకు వచ్చేలా చూస్తున్నారు. గుర్తించిన పనుల్లో మెజర్‌మెంట్స్ తీసుకోవడం, కొలతలు వేసి రికార్డులు నమోదు చేయాలి. కొత్తగా వచ్చి జీయో ట్యాగింగ్ పద్దతి ద్వారా కూలీలు ఎక్కడ పని మొదలు పెడతారో చివరికి అక్కడి నుంచే ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. రోజుకు రెండు సార్లు కూలీలు పనిచేస్తున్నట్లు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. అప్‌లోడ్ కాకపోతే కూలీలకు పేమెంట్స్ రావు. జీయో ట్యాగింగ్ పద్దతి వచ్చాక ఫోటోలు అప్‌లోడ్ కావడంలేదని చెబుతున్నారు. సెల్ వేడెక్కడం, సాంకేతిక సమస్యల వల్ల ఇబ్బందుల్ని ఎదుర్కొవాల్సి వస్తుంది. ఇంత కష్టపడి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రెండు క్యాటగిరిగా విభజించారు. ఎ క్యాటగిరిలో ఉన్న వాళ్లకు రూ.11 వేలు, బి క్యాటగిరిలో ఉన్న వాళ్లకు రూ.8 వేల జీతం మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఎఫ్‌ఎలు ఎప్పటి నుంచో పోరాడుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అనేక రూపాల్లో విన్నవించినా ప్రభుత్వాలు పట్టించుకోట్లేదు.

ఉద్యోగ భద్రతలేని దుస్థితి

ఈజీఎస్ చట్టం 2005లో వచ్చింది. పథకాన్ని అమలు చేయడంలో కోసం ఈజీఎస్‌లో మండల స్థాయిలో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. 2006 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. 18 ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాల్లేవు. కనీసం ఉద్యోగ భద్రత కూడా కల్పించబడలేదు. అనేక ప్రభుత్వాలు మారినా ఎఫ్‌ఎలను రెగ్యులర్ చేయలేదు. కనీసం బీమా సదుపాయం కూడాలేదు. ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ అమలు చేయాలని కోరుతున్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్ ల 4 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలి

ఫీల్డ్ అసిస్టెంట్లకు 4 నెలలుగా జీతాలు అందకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు అనేక ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్నారు. వారికి వెంటనే జీతాలను ఇవ్వాలి. ఎండనక, వాననక గ్రామాల్లో పేద కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించడంలో కీలకంగా కృషి చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను విస్మరించడం ప్రభుత్వాలకు తగదని హితవు పలికారు. జియో టాకింగ్ వలన వర్క్ ఐడి ఉన్నచోట ఫోటోలు తీయడం. అప్లోడ్ కాకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జియో టాగింగ్ ను రద్దు చేయాలని అన్నారు. కొలతలతో కూలీ ఇస్తున్నప్పుడు ఈ ఫోటోల సిస్టం ఎందుకని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టం 2005లో అమలైనప్పటికీ 2006 నుండి పనులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు.ప్రతి నెల ఒకటో తేదీ నాడు ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు ఇవ్వాలని,వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం.



యం. నర్సింలు వ్యకాస జిల్లా కార్యదర్శి

జీతాలు రాక కుటుంబం పోషణకు అప్పులు

నాలుగు నెల్లుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. చాలా మంది కుటుంబ అవసరాల కోసం అప్పులు చేస్తున్నారు. చేసిన అప్పులు తీర్చేందుకు నెల నెలా వాయిదాలు కట్టేందుకు డబ్బుల్లేక బంగారం అమ్మి అప్పులు కడుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఫీల్డ్ అసిస్టెంట్ల బతుకులు మాత్రం మారట్లేదు. స్కీమ్ ప్రారంభం నుంచి పనిచేస్తున్న. ఇచ్చే కొద్దిపాటి జీతం నెల నెలా ఇవ్వట్లేదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పేస్కేల్ ఇవ్వాలి. బీమా ఇతర సదుపాయాలు కల్పించాలి. ఒకటో తేదీన్నే మాకు జీతాలు ఇవ్వాలి.



ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్

ముదిరాజులకు గంగపుత్రులకు ఘర్షణ

- రెండు వర్గాల మధ్య గత కొంతకాలంగా గొడవలు
- అడ్డుకునే ప్రయత్నంలో యువకుడు మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



చేపల చెరువు విషయంలో రెండు వర్గాలు ముదిరాజులు, బెస్తలకు మధ్య గత కొంతకాలంగా గొడవలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో ముదిరాజులకు గంగపుత్రులకు ఘర్షణ వాతావరణం నెలకొంది. గంగపుత్రులు పాత సొసైటీ కావడంతో సొసైటీ సభ్యులు గ్రామ చెరువులపై హక్కు ఉంది. కొత్తవారికి సొసైటీలో సభ్యత్వం లేకపోయింది. పై అధికారుల సూచన మేరకు పోలీస్ శాఖ బందోబస్తు మధ్య చెరువులో చేపలు పట్టడానికి గంగపుత్రులు చెరువులోకి దిగారు. ముదిరాజులకు సభ్యత్వాలు లేకపోవడం కోపోద్రిక్తులైన ముదిరాజ్ యువకులు పోలీసులతో గొడవకు దిగారు. గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది.. ఈ క్రమంలో డీఎస్పీ రాజేష్, సిఐ కేశవులు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సమయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మండలంలో పర్యటన ఉండగా బూరుగుపల్లి ఘర్షణ వాతావరణం తెలుసుకొని సమస్య ఆర్డిఓ, స్థానిక ఎమ్మార్వో, డీఎస్పీ రాజేష్ రెండు గ్రూపుల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. చెరువులో చేపలు పట్టే వారిని అడ్డుకునే ప్రయత్నంలో కొల్లారి రాజు (28) నీట మునిగి మృతి చెందాడు. బూరుగుపల్లి గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవలు తారస్థాయికి చేరుకున్నాయి.

మిరుదొడ్డిలో పిల్లల కిడ్నాప్ కలకలం

నవతెలంగాణ-మిరు దొడ్డి



మండల కేంద్రమైన మిడిదొడ్డిలో పిల్లల కిడ్నాప్ కలకలం రేపింది. శుక్రవారం మిడిదొడ్డిలో సుమారు 42 సంవత్సరాల వయసు కలిగిన ఓ మహిళ అనుమానస్పదంగా తిరుగుతూ రెండో వార్డులోని ఓ పిల్లాడిని పలకరిస్తూ చేయిపట్టుకునే ప్రయత్నం చేయగా, అది గమనించిన స్థానికులు ఆ మహిళను నిలదీశారు. అసలే పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారన్న విషయం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలను కిడ్నాప్ చేయడానికి వచ్చిందేమోనని అంటూ స్థానికులు ఆమెపై ప్రశ్నల వర్షం సందించారు. దీంతో పొంతనలేని సమాధానం ఇస్తుండటంతో స్థానికులు ఆగ్రహంతో అట్టి మహిళను చితకబాదారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళను అదుపులోకి తీసుకున్నారు. బైక్ పై మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో మండల పరిధిలోని కాసాలాబాద్ బుడగ జంగం కులానికి చెందిన బాలసంత యాదమ్మగా పోలీసులు గుర్తించారు. విచారణలో పోలీసులు అసలు విషయాన్ని వెల్లడించారు. గ్రామానికి చెందిన బాలసంత ముత్తయ్య యాదమ్మలు భార్య భర్తలు. శుక్రవారం భార్య భర్తల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో భర్త ముత్తయ్యపై ఉన్న కోపంతో తన తల్లిగారయిన తొగుట మండలం గుడికందులకు మిడిదొడ్డి మీదుగా కాలినడకన బయలుదేరింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యాదమ్మ మిరుదొడ్డి రెండో వార్డులోని ఓ పిల్లాడిని అటకాయించి చేయి పట్టుకుంది. దీంతో స్థానికులు అనుమానంతో పిల్లలను కిడ్నాప్‌కు యత్నిస్తుందేమోనని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసుల పూర్తి విచారణ అనంతరం యాదమ్మను భర్త ముత్తయ్యకు అప్పగించారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గర్భిణి తాళ్ల మౌనిక తన భర్త చందన్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై ఆసుపత్రికి వెళుతుండగా మార్గమధ్యంలో దర్గా కమాన్ వద్దకు రాగానే కడుపునొప్పి వచ్చింది. దాంతో చందన్ 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ చేరుకుని పురిటి నొప్పులతో ఉన్న ఆమెను అంబులెన్స్‌లోకి తరలించి సిద్దిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. డాక్టర్ల సలహాలతో అంబులెన్స్ సిబ్బంది మహేందర్ సుఖ ప్రసవం చేశారు. మౌనిక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పుట్టిన బిడ్డ బరువు తక్కువతో ఉందని వైద్యులు తెలిపారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహను విమర్శించడం విడ్డూరం

- ఎమ్మెల్యే సోదరుల అరాచకం
- ప్రభుత్వానికి 30కోట్ల రాయల్టి ఎగవేత
- 300 కోట్ల ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బు ఎగ్గొట్టారు
- మాజీ మంత్రి హరీష్ రావు బాగోతం తెలియంది ఎవరికి
- పటాన్‌చెరును ఏటీఎంగా వాడుకుంటున్నారు
- పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-పటాన్ చెరు

స్థానిక ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అరెస్టు విషయంలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రమేయం ఉందని మాజీ మంత్రి హరీష్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలు విమర్శించడం విడ్డూరంగా ఉందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మండలంలోని లక్డారం క్వారీ విషయంలో గూడెం మహిపాల్ రెడ్డి ప్రభుత్వానికి రూ.30 కోట్ల రాయల్టిని ఎగవేశారన్నారు. పరిమితికి మించి 10లక్షల క్యూబిక్ మీటర్ల మేరకు అక్రమంగా మైనింగ్ చేశారని, రూ.300 కోట్లు ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బును ఎగ్గొట్టారని విమర్శించారు. నాటి ప్రభుత్వాన్ని కూడా తప్పుదోవ పట్టించారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్యే సోదరుల అరాచకాలు అంతా ఇంతా కాదన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు కూడా గతంలో దొంగలకు సద్ది కట్టారని విమర్శించారు. చెరువులు, కుంటలు కబ్జా చేసి వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని విమర్శించారు. గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా 10.3.2023 నాడే క్లోజింగ్ ఆర్డర్ వచ్చినా అధికారులు దాచి పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. వేల కోట్ల రూపాయలు అవినీతి చేసి దోచుకున్న డబ్బు దాచుకున్నారని మండిపడ్డారు. పుట్టుకతో భూస్వామిని అంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 2014 లో తన అఫిడవిట్‌లో ఆస్తుల చిట్టా తీస్తే తెలుస్తుందన్నారు. పటాన్‌చెరును ఏటిఎంగా మార్చుకుని అక్రమార్కులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అవసరం లేదన్నారు. అక్రమ దందాలు కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇదే మాజీ మంత్రి హరీష్ రావు తనను గతంలో టీఆర్ఎస్‌లోకి రావాలని ఒత్తిడికి గురిచేసి, ఒప్పుకోకపోతే తనను సర్పంచ్ పదవి నుంచి తొలగించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నిస్వార్థంగా ప్రభుత్వం నడిపిస్తుందని, అవినీతిని ప్రోత్సహించేది లేదన్నారు. హరీష్‌రావు బాగోతాలు అందరికీ తెలుసని, ఏ భూమి కబ్జా అయినా, ఎక్కడ అవినీతి జరిగినా వారి హస్తం ఉంటుందని ఆరోపించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో జరిగిన భారీ కుంభకోణాలలో హరీష్ రావు వాట ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహపై హరీష్ రావు అసంబద్ధ ప్రేలాపనలు తగదన్నారు. 40 వేల దొంగ ఓట్లతో గెలిచిన మహిపాల్ రెడ్డిది ఓ గెలుపా అన్నారు. నిజంగా నిజాయితీ ఉంటే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిపాల్ రెడ్డి రాజీనామా చేస్తే ఇద్దరం ఎన్నికలకు పోదామని, 30వేల మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని సవాల్ విసిరారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ గౌడ్, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, అమీన్ పూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, కౌన్సిలర్ మున్నా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీశైలం, శివానంధం, వెంకన్న, రాజిరెడ్డి, జయమ్మ చిన్న ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో వేట్టి చాకిరి

- చదువులు చెప్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణి
- విద్యార్థులతో కుర్చీలు మోయించిన ఉపాధ్యాయ సిబ్బంది



నవతెలంగాణ-చిలిపిచేడ్

విద్యార్థులకు మంచి చదువులు చెప్పి వారిని ప్రయోజకులుగా తీర్చిది ద్దాల్సిన ఉపాధ్యాయులు వారి చేత వెట్టి చాకిరి పనులు చేయిస్తున్న సంఘటన మండల కేంద్రమైన చిలిపిచేడ్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శీను బాబు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయురాలి సన్మాన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు స్థానిక విద్యార్థులచే ఉదయం నుంచి కుర్చీలు మోయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ పక్క కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇక్కడున్న అధికారుల నిర్లక్ష్యం మూలంగా విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

తెరుచుకోని పాఠశాల గదులు ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం

నవతెలంగాణ-నార్సింగి

ప్రతి సంవత్సరం లాగా విద్యా శాఖ ఈ సంవత్సరం కూడా ఎండా కాలంలో పాఠశాలను శుక్రవారం నుంచి ఒంటి పూట నడుపుతుంది. పాఠశాల సమయాలను ఉదయం 8 గంట నుంచి మధ్యాహ్నం 12:30 వరకు చదువులు చెప్పి ఆపై విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇళ్లకు పంపాలి. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాలలో ఉదయం 7.45 వరకు రావాల్సి ఉంది. ఎండల తీవ్రత వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగ కూడదని ఒక్క పూట బడులు ప్రారంభించారు. కానీ విద్యా శాఖ ఆదేశాలను కొందరు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు బేఖాతరు చేస్తున్నారు. సమయానికి రాకపోగా మమ్ములను అడిగే వారెవరూ అన్న ధీమా వారిలో కనిపిస్తుంది. మండల పరిధిలోని శేరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఒక్క ప్రాంగణంలోనే వేర్వేరు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాలలో 58 విద్యార్థులు, ప్రధాన ఉపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో 58 మంది విద్యార్థులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఉదయం 7:45కు హాజరు కావాల్సిన ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిరుపతి, రాజు, జగన్‌లు సమయానికి చేరుకోలేదు. ప్రాథమిక పాఠశాలలో ఒక్కరూ సమయానికి రాలేదు. 8 గంటలు దాటినా పాఠశాల గదులు తెరుచుకొక పోవడం వల్ల విద్యార్థులు బయట పాఠశాల ఆవరణలో ఉండిపోయారు. బడి గదులు తెరుచుకోవడం కోసం వేచి చూస్తూ ఉండిపోయారు. అదే ఆవరణలో ఉన్నత పాఠశాల ప్రార్థన జరుగుతుండగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వెళ్లి వారితో పాటు ప్రార్థన చేసారు. ప్రార్థన సగం అయిపోయాక ఒక్క ఉపాధ్యాయుడు వచ్చి ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయురాలు జయంతి సమయం దాటి పోయినా పాఠశాలకు రాలేదు. ఒంటిపూట బడులు తొలిరోజు కావడం, 8:10 వరకు కూడా రెండు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాకపోవడం తీవ్ర విమర్శలక దారితీసింది. పిల్లల భవిష్యత్తు కొరకు తల్లి దండ్రులు బడులకు పంపుతున్నా విద్య నేర్పే వారే రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తల్లి దండ్రులు కోరుతున్నారు.





చర్యలు తీసుకుంటాం : ఎంఈఓ



ఉపాధ్యాయుల ఆలస్యం విషయమై మండల విద్యాధికారి బుచ్యా నాయక్‌ను సంప్రదించగా ఉదయం 7:45కు పాఠశాలకు ఖచ్చితంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అందరూ ఉపాధ్యాయులు ఉదయం జరిగే ప్రార్థనలో విధిగా పాల్గొనాలన్నారు. శేరిపల్లి పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయుడు, మిగతా ఉపాధ్యాయుల పై చర్యలు తీసుకుంటామన్నారు. షో కాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు.

కట్టుదిట్టంగా చెక్ పోస్టులు నిర్వహించాలి



- అధికారులకు ఆర్డిఓ సూచనలు

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆర్డీవో అశోక్ చక్రవర్తి అన్నారు. నారాయణఖేడ్ నియోజక వర్గ పరిధిలో గల అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు- కరస్ గుత్తి, మోర్గి లలో నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి, డీఎస్పి వెంకట్ రెడ్డిలు పరిశీలించారు. చెక్‌పోస్ట్ ఏర్పాటుకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్, ఎస్సైలు ఇతర స్థానిక అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత తహశీల్దార్లదే

- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- కొల్చారం తహశీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కొల్చారం: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించే బాధ్యత తహశీల్దార్లదేనని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కొల్చారం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం ఈ నెల ఒకటవ తేదీ నుంచి 17 వరకు ధరణిలో వచ్చిన భూ సమస్యల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో జరుగుతున్న పెండింగ్ సమస్యల పరిష్కారం ఫైళ్లను పరిష్కరించడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొల్చారం మండల స్థాయిలో మొత్తం 241 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తహసిల్దార్ పరిధిలో 29 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా శుక్రవారం వరకు 9 దరఖాస్తులు మాత్రమే పరిష్కారం కావడం పట్ల అదనపు కలెక్టర్ తహసీల్దార్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా దరఖాస్తులన్నీ నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు.

అసైన్డ్ భూముల క్రయవిక్రయాలపై చర్యలకు ఆదేశం

కొల్చారం మండలం దుంపలకుంట చౌరస్తాలో ప్రభుత్వ అసైన్ భూముల్లో ఇళ్ల నిర్మిస్తున్న ఆక్రమణ దారులకు వెంటనే నోటీసులు అందజేసి కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. పంటల సాగు కోసం ప్రభుత్వం నిరుపేద రైతులకు ఇచ్చిన భూములు అన్యాక్రాంతమైతే సంబంధిత రైతులకు నోటీసులు అందజేసి తిరిగి ప్రభుత్వంకు సాధీనం చేసే బాధ్యత తాసిల్దారుల దేనిని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. వెంటనే మండలంలోని దుంపలకుంట చౌరస్తా ఏడుపాయల టీ జంక్షన్ వద్ద అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల యజమానులకు నోటీసులు అందజేసి తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం పోతంశెట్టిపల్లి శివారులోని సర్వే నెంబర్ 254 లో ప్రభుత్వ భూమిలో వైన్స్ ఏర్పాటు చేయడం పై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వైన్స్ యజమాన్యానికి, ప్రభుత్వం అసైన్ చేసిన భూమి యజమానికి నోటీసులు అందజేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని అదనపు కలెక్టర్ స్థానిక తహశీల్దార్ ను ఆదేశించారు. అలాగే చిన్నగణపూర్ ఐబి సమీపంలో గతంలో ప్రభుత్వం ఆర్టీసీకి అప్పగించిన ప్రభుత్వ భూమిని అన్యకాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, ఆర్ ఐ ప్రభాకర్, ధరణి ఆపరేటర్ మహేష్ పాల్గొన్నారు.



పోలీస్‌లకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- బంగారు కృష్ణ



నవతెలంగాణ-సంగారెడ్డి
సంగారెడ్డి జిల్లాలో పోలీస్‌లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి అని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి ఐ. బి. అమర వీరుల స్థూపం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బంగారు కృష్ణ మాట్లాడుతూ పోలీసులకు జులై, నవంబర్, జనవరి సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా 15 నెలల టిఏ బిల్లులు, 8 నెలల డిఏ ఏరియర్స్, 14 ఇన్‌స్టాల్ మెంట్స్ పిఆర్‌సీ బిల్లులు పెండింగ్ లో ఉండడం వల్ల పోలీస్ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఈ నెల ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు పెండింగ్ బిల్లులు విడుదల చేసి న్యాయం చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో పొట్టిగాళ్ల మోహన్, ఎల్. వేణు గోపాల్, డి. శ్రీనివాస్, బి. యాదయ్య కె. ప్రభు, కె. ప్రవీణ్,. వై. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

- కేవిపిఎస్



నవతెలంగాణ -నారాయణఖేడ్ రూరల్
నారాయణఖేడ్ డివిజన్ కేంద్రంలోని కెవిపిఎస్ ఆఫీస్‌లో కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కేవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మోషప్ప మాట్లాడుతూ..... ప్రభుత్వ హాస్టల్స్ లలో పిల్లలకు భోజనం సరిగా పెట్టడం లేదని అన్నారు. పిల్లలకు మెను ప్రకారం పెట్టాల్సింది పెట్టకుండా పురుగుల అన్నం నీళ్ల చారు పెడుతున్నారని, అదేవిధంగా ప్రభుత్వం పేరుకు మాత్రమే సన్న బియ్యం అని చెప్తున్నారు కానీ పిల్లలకు మాత్రం దొడ్డు బియ్యం పెడుతున్నారని విమర్శించారు. పేద పిల్లల కోసం ప్రభుత్వం పంపుతున్న ఆట వస్తువులు పిల్లలకు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి వార్డెన్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ , విజయ్,రాహుల్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వికలాంగుల సాధికారతకోసం కృషి చేస్తాం

- వికలాంగుల సంక్షేమ శాఖ డిప్యుటీ డైరెక్టర్ కె లలిత కుమారి
- విద్యా, స్వయం ఉపాధి, ఆరోగ్యం, రక్షణ కల్పించాలి
- ఎన్.పి.ఆర్.డి రాష్ట్ర కార్యదర్శి యం.అడివయ్య



నవతెలంగాణ-సంగారెడ్డి
మహిళా వికలాంగులకు సంక్షేమం, సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డిప్యుటీ డైరెక్టర్ కె. లలిత కుమారి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 23,24 తేదీల్లో ఎన్.పి.ఆర్.డి ఆధ్వర్యంలో హైదరాబాద్లో జరుగుతున్న మహిళా వికలాంగుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ను శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఆమె చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యుటీ డైరెక్టర్ కె.లలిత కుమారి మాట్లాడుతూ సమాన అవకాశాలు కల్పిస్తే వికలాంగులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తారని అన్నారు. ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కార్యదర్శి యం. అడివయ్య, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. మాణిక్ మాట్లాడుతూ దేశంలో మహిళలు, మహిళా వికలాంగులపై వేధింపులు, అత్యాచారాలు పెరిగి పోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 4లక్షల మంది మహిళా వికలాంగులు ఉన్నారు ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పందం పత్రంలోని ఆర్టికల్ 3,6లలో మహిళా వికలాంగుల హక్కులు పొందుపరచినా అమలు కావడం లేదన్నారు. మహిళా వికలాంగుల్లో వివాహం కానీ వారి సంఖ్య 4రేట్లు అధికంగా ఉందని ఉన్నతి అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడి అయ్యింది అని అన్నారు. మహిళా మానసిక వికలాంగులు 70శాతం లైంగిక దురాక్రమణకు గురవుతున్నారని అన్నారు.. గృహహింస చట్టంలోని సెక్షన్ 3(బి),(డి)మహిళా వికలాంగులు వినియోగించుకోవడం లేదు అని అన్నారు. మహిళా వికలాంగుల హక్కులు, రక్షణ కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. మహిళా వికలాంగులపై వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, మహిళా వికలాంగులను వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని, పెండ్లి కానీ మహిళా వికలాంగులకు ప్రభుత్వమే ఇండ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మహిళా వికలాంగుల సాధికారత విద్యా స్వయం ఉపాధి,ఆరోగ్యం సంరక్షణ, భద్రతపై అవగాహనా కల్పించేందుకు సదస్సు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మార్చి 23,24తేదీల్లో హైదరాబాద్లో జరుగుతున్న రాష్ట్ర సదస్సుకు 33 జిల్లాల నుండి 500మంది ప్రతినిధులు హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె. నర్సిములు, జయలక్ష్మి, జిల్లా కోశాధికారి బుక్క ఇస్మాయిల్, జిల్లా సహాయ కార్యదర్శి బాలయ్య, జిల్లా కమిటి సభ్యులు సుధాకర్, అందుల సంక్షేమ సంగం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, టి ఎం డి ఏ రాష్ట్ర కార్యదర్శి యం. రవికుమార్, టి వి వి జిల్లా అధ్యక్షులు ఆర్. నర్సిములు, వి జె ఎ సి జిల్లా కన్వీనర్ ఏ.మహేష్ కుమార్, నిరుద్యోగుల సంగం జిల్లా అధ్యక్షులు సాయి కుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరపాలి

- రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించాలి
- అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షులు కాన్సిరాం,
- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని, అన్ని విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేస్తుందని అంబేద్కర్ సంఘం నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షులు కాన్సిరాం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ లో జరిగిన కెవిపిఎస్ అంబేద్కర్ దళిత సామాజిక ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని ఏప్రిల్ 14న మొక్కుబడిగా కాకుండా గ్రామగ్రామాన బస్తీలలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో ఘనంగా వేడుకలు నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని విద్యాసంస్థలలో రాజ్యాంగ పీఠిక ను ప్రతిజ్ఞ చేయించే విధంగా ప్రభుత్వం నిర్ణయించాలని అన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మోషప్ప చంద్రశేఖర్ అరుణ్ అంబేద్కర్ దళిత సంఘాల నాయకులు నర్సింలు సంజీవ్ గంగ్వార్ తుకారం అంబోజి గౌతమ్ జంబల్ మారుతి సురేష్ రాజు రాజేష్ ఓంకార్ శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్లు పంపి దాహార్తిని తీర్చండి మహాప్రభో

- గాంధీ నగర్, బీసీ కాలనీల ప్రజల విజ్ఞప్తి



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం
నీటి ట్యాంకర్లు పంపి తమ దాహార్తిని తీర్చండి మహాప్రభో అంటూ బొలారం మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్, బీసీ కాలనీ ప్రజలు పాలక వర్గాన్ని, స్వచ్ఛంద సంస్థలను, వివిధ పార్టీల నేతలను కోరుతున్నారు. గత కొన్ని నెలలుగా వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండక భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. లోకల్ వాటర్ సైతం సక్రమంగా రాకపోవటం తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గతంలో ఎంఎల్‌ఏ గూడెం మహిపాల్ రెడ్డి, నీలం మధు,వీవీఆర్ ఫౌండేషన్, కేటీఆర్ యువసేన ఆధ్వర్యంలో నీటి ట్యాంకర్లు పంపి ఆదుకునేవారు. కానీ ఈ సంవత్సరం ఎవరు ముందు కు రాకపోవటం తో స్థానికులు నీటి సమస్య తో ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయా పార్టీల సహకారం తో నీటి ట్యాంకర్లు పంపేవారని, ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు ఉన్నా ఏ పార్టీ కూడా ఇంతవరకు ట్యాంకర్లు పంపలేదు.అలాగే మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కలుపుతున్నారని వార్తలు రావడంతో స్థానిక నాయకులు కూడా ట్యాంకర్లు పంపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలక వర్గం, వివిధ రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి నీటి ట్యాంకర్లు పంపి తమ దాహార్తిని తీర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ పథకమే ఫెయిల్..!

- మంచి నీటి సమస్యపై సభ్యుల ఫైర్



నవతెలంగాణ-ఝరాసంగం
మండల పరిధిలోని ఈదులపల్లి, మేదపల్లి గ్రామాలలో గత పది సంవత్సరాల నుండి ప్రైవేటు వ్యక్తుల దగ్గర బోరు బావులను లీజుకు తీసుకుని ప్రజలకు మంచి నీటిని అందజేస్తున్నామని, మిషన్ భగీరథ నీరు వారానికి ఒకసారి కేవలం 'చూపుడు గుర్రం'లా కూడా రావడం లేదని అసలు మిషన్ భగీరథ పథకమే ఫెయిల్ అని ఎంపీటీసీ సభ్యులు శంకర్ పాటిల్ సంబంధిత శాఖపై ఫైర్ అయ్యారు. ఎంపీడీవో కటికే దేవదాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మండల అభివృద్ధి అధికారి సుధాకర్ శుక్రవారం కొనసాగించారు. 19 శాఖలతో సమావేశాన్ని ఏర్పాటు చేయగా 12 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఏడు శాఖల అధికారులకు మెమోలు జారీ చేస్తామన్నారు. ప్రజా పాలనలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆన్లైన్లో వివిధ పథకాలకు అర్హులు కావడంలేదని తమ పేర్లు ఆన్లైన్లో కనిపించినా తాము అర్హులం కాలేకపోతున్నామని కో ఆప్షన్ నెంబర్ ఇక్బాల్ జానీ, ఎంపిటిసి సభ్యులు శంకర్ పాటిల్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ కూలీలకు వారి ఖాతాలలో డబ్బులు జమ కావడం లేదని ఎంపీపీ ప్రశ్నించగా.. 452 మంది కూలీలకు ఖాతా సమస్యలు ఉన్నాయని వాటిని దశలవారీగా పరిష్కరిస్తున్నామని ఆ శాఖ అధికారి తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి మండల వ్యాప్తంగా 800 ల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని.. ధరణి స్పెషల్ డ్రైవ్ లో ఇప్పటివరకు 300 దరఖాస్తులను క్లియర్ చేయడం జరిగిందని మరో వారం రోజుల్లో పూర్తి మొత్తంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. బర్దిపూర్ నుండి మాసనూరు గ్రామం వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని ఎంపీటీసీ రాజు సభా దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లన్న పాటిల్, సభ్యులు విజేందర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్, అక్రమ క్రషర్స్, భూములు ఆక్రమించింది బీఆర్ఎస్ పార్టీ నాయకులే

- హరీశ్‌రావుకు సంజీవరెడ్డి కౌంటర్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్
మాపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని హరీష్ రావు అనడం చాలా విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.. సమావేశంలో వారు మాట్లాడుతూ... అక్రమ మైనింగ్, అక్రమ క్రషర్స్, అక్రమ ఇసుక దందా, అక్రమంగా భూములు ఆక్రమించుకున్నది బీఆర్ఎస్ నాయకులేనని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హరీశ్‌రావుపై మండిపడ్డారు. పది సంవత్సరాల కాలంలో ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, ప్రశ్నిస్తే అక్రమ కట్టడాలు కడితే అడిగినందుకు కేసులు బనాయించడం, సింగూర్ నీళ్ల అక్రమ తరలింపు పై అడిగితే కేసులు బనాయించడం గతంలో నిరాధారమైన ఆరోపణలు చేశారని అన్నారు. ఏడు సంవత్సరాల నుండి కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని అన్నారు. కానీ హరీశ్‌రావు మేము బెదిరిస్తున్నామని, కక్ష సాధింపు చర్య చేస్తున్నామని, పార్టీలోకి రమ్మని ఒత్తిడి తెస్తున్నామని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. టిఆర్ఎస్ నాయకులు కల్హేర్ మండలంలోని బాచేపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 1 లో మైనింగ్ పర్మిషన్ వస్తే అక్కడ కాకుండా వేరే దగ్గర మైనింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. సర్వే నెంబర్ 54ఎ స్టోన్ క్రషర్ ఎస్వీవి కిరాణా లో అక్రమ మైనింగ్ కొనసాగిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎర్రబొగుడ గ్రామం శివ రాములు 43 /ఏ ఏ/ఆ సర్వే నెంబర్లు పర్మిషన్ ఉంటే వేరే దగ్గర స్టోన్ క్రషర్ అక్రమంగా నడుస్తుందని అన్నారు. ఇసుక మాఫియా అక్రమంగా నడుస్తున్నాయని అన్నారు. అసైన్డ్ భూములు, ఇనాం భూములు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. హరీశ్‌రావు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాజిరెడ్డి, నరసింహారెడ్డి, రమేష్ చౌహాన్, సురేందర్ రెడ్డి, పండరి రెడ్డి, దిగంబర్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, సంగమేశ్వర్ సెట్, సిద్ధారెడ్డి, తౌసిబ్ ముల్సాబ్, నజీర్, నర్సింలు యాదవ్, జ్ఞానేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ హనుమాన్లు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతీనగర్ ఎంఐజి కాలనీని అభివృద్ధి పరుస్తా

- సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ



నవతెలంగాణ-రామచంద్రాపురం
భారతీనగర్ డివిజన్లోని ఎంఐజి కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. మూడవసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యేను సన్మానించారు గాంధీని గురువారం సాయంత్రం కార్పొరేటర్ సింధు మరియు సొసైటీ డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తనమీద నమ్మకంతో మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. తన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివద్ధికి సహకరిస్తానని అన్నారు. కార్పొరేటర్ సింధు అడిగిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. అనంతరం కార్పొరేటర్ సింధు మాట్లాడుతూ గతంలో మంజూరైన పలు కాలనీ పనులు మసీద్ మరమ్మతులు, సంకల్ప గ్రౌండ్ లో షేడ్ నిర్మాణం,ఎఫ్.పార్క్, నేతాజీ హాల్ లో పలు పనులు ఎమ్మెల్యే చొరవతో జరుగుతున్నాయనీ త్వరలోనే ప్రారంభించుకుంటాం అని అన్నారు. ఎమ్మెల్యే గాంధీ సహకారంతో కాలనీ లో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మిగిలి ఉన్న సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం సైతం నిర్మించేందుకు ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, నాగమణి, కాలనీ అధ్యక్షులు వెంకట్ రావు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ గౌడ్, సెక్రెటరీ సుబ్బా రావు, డైరెక్టర్లు నీలకంఠం, రాముకు, డివిజన్ బి.ఆర్.ఎస్ ప్రెసిడెంట్ బూన్, ఎంఐజి బి.ఆర్.ఎస్ ప్రెసిడెంట్ భాస్కర్, సెక్రెటరీ కుమార్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, వార్డ్ మెంబర్ తిలవత్, సీనియర్ నాయకులు సంపత్ గౌడ్, సురేందర్, చంద్రయ్య, మహిళా నాయకులు రాణి యాదవ్, శ్రీలత, అనిత, బేబీ, లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక శిక్షణతో లోతైన అవగాహన

- రికీ గ్లోబల్ ట్రేడింగ్ సీనియర్ టెక్నికల్ సేల్స్ మేనేజర్ డాక్టర్ నవీన్ కుమార్ కొట్టక్కి



నవతెలంగాణ-పటాన్‌చెరు
ప్రయోగాత్మక శిక్షణ విద్యార్థులకు వారి రంగంపై లోతైన అవగాహనను కల్పిస్తుందని రికీ గ్లోబల్ ట్రేడింగ్ సీనియర్ టెక్నికల్ సేల్స్ మేనేజర్ డాక్టర్ నవీన్ కుమార్ కొట్టక్కి అన్నారు. రికీ గ్లోబల్ వ్యవస్థాపకుడు సంజయ్ సి. మెహతాతో కలిసి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం 'ఫార్మా విద్యార్థులకు అవకాశాలు – విశ్లేషణాత్మక ఇంటర్న్షిప్ శిక్షణ'పై ప్రసంగించారు.రికీ గ్లోబల్లో నిర్వహిస్తున్న మూడు నెలల శిక్షణ వివరాలను డాక్టర్ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులు తమ నైపుణ్యాలను, విశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు, వాస్తవ ప్రపంచ దృశ్యాలలో సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని వర్తింపజేయడానికి వీలు కల్పిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ప్రశంసా పత్రం కూడా అందజేస్తామని, బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగం పొందడానికి అది వీలు కల్పిస్తుందన్నారు. తద్వారా ఆయా కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు ప్రాంగణ నియామకాల సంఖ్య పెరగడానికి కూడా దోహదపడుతుందని డాక్టర్ నవీన్ అభిప్రాయపడ్డారు.తొలుత, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను స్వాగతించి, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. రికీ గ్లోబల్ శిక్షణ కోసం గీతం ఫార్మసీ విద్యార్థులను ఎంపిక చేశారు.

కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి

- మతపెద్దలతో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ భేటీ



నవతెలంగాణ-సంగారెడ్డి
కులమతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం సంగారెడ్డి నందు పీస్ కమిటీ మీటింగ్ (శాంతి సమావేశం) వివిధ మత పెద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండగ, ముస్లిం సోదరుల పవిత్ర మాసం రంజాన్, గుడ్ ఫ్రైడే, హోలీ పండగలు ఏకకాలంలో వస్తున్న సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కులమతాలు వేరైనా మొదటిగా ప్రతి ఒక్కరూ భారతీయులమన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు సంఘవిద్రోహశక్తులు ఎవరైనా మతవిద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాలలో పోస్టులు చేసినా వారిపైన చట్ట పరంగా కఠిన చర్యలుంటాయన్నారు. అత్యవసర, ఆపద సమయంలో డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, నారాయణ్ ఖేడ్ డి.యస్.పి. వెంకట్ రెడ్డి, వర్టికల్ డి.యస్.పి జి. రాణ వీరారెడ్డి , యస్.బి. ఇన్స్పెక్టర్ మల్లేష్, జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్-ఇన్స్పెక్టర్స్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన వివిధ మతాలకు చెందిన మతపెద్దలు రాజకీయ నాయకులు జిల్లా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలి





నవతెలంగాణ -మునిపల్లి
మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయింపులో కోత విధిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ నిరసనలు చేపడుతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కార్మికులన్నా వ్యవసాయదారులన్న చిన్న చూపు ఎందుకు అన్నారు.మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పై ఆధారపడి అనేక కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. గత మూడు నెలలుగా ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు డబ్బులు రాక నానా కష్టాలు పడుతున్నామన్నారు. కూలీలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా సకాలంలో డబ్బులు రాక కుటుంబ అవసరాలను తీర్చలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించలని లేని పక్షంలో ఉద్యమం చేస్తామని అన్నారు.

గాలి అనిల్ కుమార్‌కు సన్మానం



నవతెలంగాణ- జోగిపేట: జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ను జోగిపేట టిఆర్ఎస్ నాయకులు ఘనంగా శుక్రవారం సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. జైపాల్ రెడ్డి, చాపల వెంకటేశం, సార శ్రీధర్ ,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'సప్తహ'ను ప్రారంభించిన సామాజికవేత్త ఢిల్లీ వసంత్



నవతెలంగాణ - ఝరాసంగం
మండల పరిధిలోని కుప్ప నగర్ గ్రామంలో గల భవాని మాత మందిరంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే సప్తహ,గజ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమ కరపత్రాన్ని రైతు ఉద్యమ నేత, బిజెపి నాయకులు ఢిల్లీ వసంత్ కుమార్ శుక్రవారం ఆలయావరణలో ప్రారంభించారు. గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌కి ఎంపికైన గురుకుల విద్యార్థిని



నవతెలంగాణ - మునిపల్లి
పంజాబ్ రాష్ట్రం అమృత్సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ మండల పరిధిలోని బుదేరా గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని శిల్పారాణి ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి జరుగనున్న పోటీల్లో పాల్గొనేందుకు శిల్పారాణి హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థి శిల్పారాణిని కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసిన్ ఆరా, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపక బృందం అభినందించారు.

కేతకిని సందర్శించిన కేంద్ర సహాయ మంత్రి



నవతెలంగాణ-ఝరాసంగం
శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం కుటుంబ సమేతంగా కేంద్ర సహాయ మంత్రి భగవత్ ఖుబా సందర్శించి దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు శాలువా పూలమాలతో సన్మానించి ప్రసాదాలను అందజేశారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు.. పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ- కొండాపూర్
మండల పరిధిలో హరిదాస్పూర్ గ్రామపంచాయతీలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నా విద్యుత్ అధికారులు పర్యవేక్షణ కరువై వారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృధా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో వీధిదీపాలు నిరంతరం వెలుగుతూనే ఉంటాయి. పగలు రాత్రి తేడా లేకుండా వెలుగు తుండంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృధా అవుతుంది. ఈ విషయంపై స్థానికులు పంచాయతీ సెక్రెటరీని ఎన్నిసార్లు సంప్రదించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆన్ ఆఫ్ స్విచ్చు లేక గ్రామ పంచాయతీలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ




నవతెలంగాణ -వాట్పల్లి
మండలంలోని మేడికుంద గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఒంటి పూట బడుల సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులే టీచర్లుగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా ఐశ్వర్య, కలెక్టర్గా స్వాతి, మండల విద్యాధికారిగా రాకేష్, ప్రధానోపాధ్యాయులుగా అంజలి, ఉపాధ్యాయులుగా ఆనంద్, కుషాల్,పరమేశ్వర్,మమత, అశ్విని, అభిరామ్ వ్యవహరించారు.

'అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి'



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్
తనను జహీరాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన మాజీ సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నారాయణఖేడ్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశామని అన్నారు. ఈ జిల్లా వాసిగా... మీకందరికీ తెలిసిన వాడిగా.... ఎప్పటికీ అందుబాటులో ఉండే వాడిగా... ప్రశ్నించే గొంతుకగా... పార్లమెంటు కు పంపించాలని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. బీబీ పటేల్ అందుబాటులో ఉండకుండా ఈ పార్లమెంట్ నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాలలో ఉంటూ ప్రజలను నిర్లక్ష్యం చేశారని అన్నారు. పార్టీకి ద్రోహం చేసి బిజెపిలోకి పోయారని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండే మన పార్లమెంటు అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్ టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ - రామచంద్రాపురం
రామచంద్రపురం డివిజన్ లోని మయూరి నగర్, శ్రీ సాయి నగర్ కాలనీలో శుక్రవారం సుమారు 61.50 లక్షల విలువచేసే సీసీ రోడ్ పనులకు రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్ స్థానికులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో పెండింగ్లో ఉన్న ఇతర పనులను సైతం పూర్తిస్థాయిలో చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు రాజు గౌడ్, శంకర్ యాదవ్, విఠల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్, వెంకట్ రామ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, దేవేందర్ యాదవ్, చక్రవర్తి, రమేష్, వీరిశెట్టి, గోవర్ధన్ రెడ్డి, రాజేశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ కి భూమి పూజ



నవతెలంగాణ-కొండాపూర్
మండల కేంద్రంలోని హరిదాస్పూర్ గ్రామంలో ఎస్‌డిఎఫ్ ఫండ్స్‌తో నూతన ఆర్వోప్లాంట్ కు మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నర్సింలు ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవివి దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు మంచినీళ్ల తాగాలని ఉద్దేశంతో తమ గ్రామానికి పైఅధికారులతో చర్చించి ఆర్వో ప్లాంట్ శాంక్షన్ చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయ్ రవి, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

నవతెలంగాణ-నర్సాపూర్ + నర్సాపూర్ నియోజకవర్గ వర్గం వెల్దుర్తి మండల పరిధిలోని మంగలపర్తి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగల్ పర్తి గ్రామ తాజా మాజీ సర్పంచి రామకృష్ణారావు, మాజీ సర్పంచ్ మిర్జాపల్లి కరుణాకర్‌తో పాటు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో శుక్రవారం నర్సాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు గౌడ్, కరుణాకర్ రెడ్డి ,మల్లేశం, ఉదయ్ హరీష్, సుదర్శన్ గౌడ్, నరేందర్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ బాధితులకు అవగాహన

నవతెలంగాణ- నిజాంపేట



మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిజాంపేట ఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. రెండు సంవత్సరాలుగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టుకు హాజరు పరిచామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సునీత, కానిస్టేబుల్ సాయిబాబా, సోహెల్, వినోద్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

పిఆర్టియు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి



నవతెలంగాణ-చిలిపిచేడ్

చిలిపిచేడ్ మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు. వివిధ శాఖల మహిళ అధికారులను సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా చండూరు గ్రామానికి చెందిన చౌటకూర్ గోవర్ధన్ రెడ్డి బ్రదర్స్, చిట్కుల్ గ్రామానికి చెందిన తారా విష్ణువర్ధన్ రెడ్డిల ఆర్థిక సహాయంతో మండల పిఆర్టియు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూర రగోతంరెడ్డి, పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురు మహిళా ఉపాధ్యాయులు పల శాఖల్లో పని చేస్తున్న అధికారులకు వారు సన్మానించి మెమొంటోను అందజేశారు. అనంతరం చౌటకూరి గోవర్ధన్ రెడ్డి బ్రదర్స్, తార విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని మన దేశం మహిళలపై ఆధారపడి ఉందన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నర్సాపూర్



విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కురుపాచారి ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమ్మరి కృపాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల ఐదు జాతుల వారు కులవృత్తులు నమ్ముకొని బతుకు జీవనం సాగిస్తున్నందున ప్రస్తుతం యంత్రాలు రావడం వల్ల తమకు పనులు దొరకక కడు దుర్భర జీవితాలను గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాల వారికి 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయగా విశ్వబ్రాహ్మణ కులస్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



నవతెలంగాణ- వెల్దుర్తి

మాసాయిపేట మండలం కొప్పులపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివే పేద విద్యార్థులకు జీఎంఆర్ ఫౌండేషన్ శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్, స్కేల్స్, అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు మాసాయిపేట మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో బెంచీలను ఆట వస్తువులు యూనిఫార్మ్ కుర్చీలు అందజేయడం జరిగిందన్నారు. జీఎంఆర్ ఎప్పుడు పేద విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ చారి, కృష్ణకాంత్. వెంకటేష్. పాషా మహేష్ గీత కవిత పాల్గొన్నారు.

గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ హనోక్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ సాగర్, జాయింట్ సెక్రెటరీ దేవదాసు, ట్రెజరర్ కిరణ్ కుమార్, కమిటీ డైరెక్టర్ సురేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు పనులకు శంకుస్థాపన



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో గ్రామంలో వేయనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శుక్రవారం పెద్ద చింతకుంట గ్రామంలోని పలు కాలనీలలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు, గ్రామ తాజా మాజీ సర్పంచ్ శివకుమార్ సిసి రోడ్డు నిర్మాణ పనుల కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధులతో గ్రామ అభివృద్ధి కోసం గ్రామంలో సిసి రోడ్ల వేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ కడారి నాగరాజ్, రాములు, ప్రసాద్, మల్లేశం, బిక్షపతి గౌడ్, మురళి, నర్సింలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని ఖాసీంపూర్ తాండ గ్రామంలో అంతర్గత రోడ్లు బాగలేనందున జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ పెద్దలు, గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కోసం నిధులను కేటాయించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధరావత్ విట్టల్, లోగులోత్ గోపాల్, లౌడ్య రామచంద్ర, బాబు, మోతీరాం, గుగులోత్ లచ్చిరాం, సేవా, మోహన్, కిషన్ పాల్గొన్నారు.

రైతు కుటుంబంలో ఆణిముత్యం

- ఒకప్పుడు జూనియర్ అసిస్టెంట్.. ఇప్పుడు ఐపిఎస్..
- చదువు విలువ తెలియజేసిన మహనీయుల చరిత్ర
- సివిల్స్ వైపు అడుగులు వేయించిన పేదరికం
- ట్యూషన్ చెప్పుకుంటూ చదివిన అధికారి
- మెదక్ ఎస్పీ బాలస్వామి సక్సెస్ స్టోరీ

పేదరికం, ఆర్థిక, సామాజిక అసమానతలను ఎదుర్కొని సమగ్ర అభివృద్ధి సాధించాలంటే విద్య ఒక్కటే మూలాధారమని భావించారు. మహనీయుల చరిత్రలను తిరగేసి చదువు విలువ తెలుసుకున్నారు. చదువుతోనే సమాజంలో గౌరవం ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని అర్థం చేసుకున్నారు. అష్టకష్టాల నడుమ ప్రభుత్వ విద్యను అభ్యసించి 18 ఏళ్లకే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. అక్కడితో ఆగకుండా ఉద్యోగానికి సెలవు పెట్టి ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా.. దూర విద్యలో డిగ్రీ, పీహెచ్ డీ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని పక్కన పెట్టి సివిల్స్ వైపు దృష్టి సారించి మూడో ప్రయత్నంలో ఐపిఎస్ సాధించి ఆశించిన లక్ష్యాన్ని చేరుకొని ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మారుమూల పల్లెటూరిలో రెక్కాడితే గాని డొక్కాడని నిరక్షరాస్యులైన వ్యవసాయ ఆధారిత కుటుంబానికి చెందిన మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి ఐపిఎస్ సక్సెస్ స్టోరీ ఆయన మాటల్లోనే..

నవతెలంగాణ-మెదక్

మాది నాగర్ కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండల పరిధిలోని గౌతంపల్లి అనే మారుమూల గ్రామం. అమ్మ వెంకటమ్మ నాన్న బుచ్చయ్య, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. మూడెకరాల వర్షాధారిత వ్యవసాయ భూమిని నమ్ముకొని మా కుటుంబం బతికింది. పెద్ద వాడిని అయిన నేను మూడో తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ బడిలో అక్షరాలు దిద్దాను. ఆ తరువాత 4 నుంచి 7వ తరగతి వరకు అనంతసాగర్ అనే గ్రామానికి కాలినడకన వెళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకున్నాను. 8 నుంచి 10వ తరగతి వరకు నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ పాఠశాలలో హాస్టల్ లో ఉండి చదువుకున్నాను. ఇంటర్మీడియట్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో పూర్తి చేశాను. ఆ తరువాత ఇంజనీరింగ్ వైపు వెళ్ళాలనే ఆసక్తి ఉన్నా. ఆర్థిక స్థోమత లేకపోవడంతో తెల్కపల్లిలో టీటీసీ పూర్తి చేశాను. దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేశాను. 18 ఏళ్ల వయస్సులోనే మహబూబ్ నగర్ లో ప్రభుత్వ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. మూడేళ్ల పాటు విధులు నిర్వర్తించాను. అయినా ఏదో సాధించాలనే పట్టుదలతో రెండేళ్ల ఉద్యోగానికి సెలవు పెట్టి పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ రెగ్యులర్ గా పూర్తి చేశాను. ఆ తరువాత అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీహెచ్ డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందాను. ఇదే సమయంలో ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం వచ్చింది. అక్కడ పనిచేస్తున్నప్పటికీ చేరాల్సిన గమ్యం ఇంకా ఉంది అనే ఆలోచన కలిగింది. ఇదే సమయంలో యూపీఎస్సి సివిల్ సర్వీస్ ఎగ్జాం 2006 లో దేశంలోనే టాపర్ గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ కు చెందిన ముత్యాల రాజు ఐఎఎస్ ను స్ఫూర్తిగా తీసుకుని సివిల్స్ పరీక్షలు రాయాలనుకున్నాను. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రెండేళ్ళ సెలవు పెట్టి సివిల్స్ పరీక్షలకు సన్నద్ధం అయ్యాను. దీంతో ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఏడేళ్లు చాలా కష్టపడ్డాను. రెండు సార్లు ఐఆర్ఎస్ వచ్చింది, మూడో ప్రయత్నంలో 2018 లో ఐపిఎస్ సాధించాను. భవిష్యత్తులో మంచి హోదాలో విద్యా వ్యవస్థ వైపు అడుగులు వేయాలని ఉంది.

ప్రేమించి.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న:

సమాజంలో చదువుతోనే విలువ ఉంటుందని తెలుసుకున్న, చదువుకుంటేనే ఉన్నత స్థాయికి వస్తాం.. మంచి ఉద్యోగం వస్తుందని అర్థం చేసుకొని అప్పటి వరకు పెళ్లి అనే ఆలోచన వద్దనుకున్నాను. సివిల్స్ రాసేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. 2018 బ్యాచ్‌లో ఐపిఎస్‌గా సెలెక్ట్ అయ్యాకనే 2021 ఫిబ్రవరి 14న ప్రేమించిన కృష్ణవేణిని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నాను. తాను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా (స్కూల్ అసిస్టెంట్) ఉద్యోగం చేస్తోంది. మాకు రెండేళ్ల బాబు రిషాంక్ ఉన్నాడు.

చెల్లెలు ఆవులను మేపుతుంటే.. నేను బడికి వెళ్ళాను:

పల్లెటూరిలో వ్యవసాయ ఆధారిత కుటుంభం మాది. ఆర్థిక అసమానతల వలన కుటుంబ పరిస్థితులు అనుకూలంగా ఉండేవి కావు. అప్పట్లో ఒక కుటుంబంలోని పిల్లలు అందరినీ చదివించే పరిస్థితులు ఉండేవి కావు. అమ్మా నాన్న పూర్తిగా నిరక్ష్యరాస్యులు, కానిస్టేబుల్ కు ఐపిఎస్ అధికారికి తేడా తెలియనంత అమాయకత్వం వారిది. మా పరిస్థితిని చూసి ఊరిలో ఉండే విష్ణుమూర్తి టీచర్ ఆవును కొనుగోలు చేసి జీవనోపాధి పొందేందుకు రూ. 500 ఇచ్చాడు. ఆ డబ్బులతో కొనుగోలు చేసిన ఆవు కొద్ది రోజులకు మరో ఆవుకు జన్మనిచ్చింది. మా పెద్ద చెల్లెలు ఆవులను చూసుకునేందుకు వెళ్లడం వలన బడికి పంప లేకపోయాము. కుటుంబ పరిస్థితులను చూస్తూ పట్టుదలతో చదువుకున్నాను.

మహనీయుల చరిత్ర చదవడం వల్లే చదువు విలువ తెలుసుకున్నా:

అంబేద్కర్ వంటి మహనీయుల జీవిత చరిత్ర చదవడం వల్లే చదువు విలువ తెలుసుకున్నాను. పదో తరగతి పూర్తి అయ్యాక ఏపిఆర్ ఎస్ జేసీ ప్రవేశ పరీక్ష రాయాలనుకున్నాను. ఇందుకోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో క్యాస్ట్, రెసిడెన్స్ సర్టిఫికెట్ కోసం మా నాన్న వారం రోజులు తిరిగినా పని కాలేదు. దీంతో జెడ్పీటీసీ హోదాలో ఉన్న బంధువు సహకారం తీసుకున్నాము. అయినప్పటికీ పని కాకపోవడంతో ఆర్డీవో దగ్గరకి వెళ్తే చివరి సమయంలో సర్టిఫికెట్లు ఇచ్చారు. అప్పుడే చదువుకోవాలి, ఉన్నతమైన స్థానంలో ఉండాలి అని నిర్ణయించుకున్నాను.

బాలు మరణం బాదకల్గించింది:

బాల్య మిత్రులలో సరదాగా గడిపేది. ఇంటర్ లో ఒకే గదిలో ఉండే బాలు అనే మిత్రుడితో పోటీ పడి చదివే వాడిని. నేను ఓపెన్ డిగ్రీ చేసే సమయంలో నా రూం కు వచ్చి వెళ్లిన రెండు రోజులకే రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆ ఘటన మనసుకు చాలా బాధ కలిగించింది. నా జీవితంలో మర్చిపోలేని సంఘటన అది. ఒక మంచి స్నేహితుడిని కోల్పోయాను.

ఐపిఎస్ అయ్యాక సవాల్ విసిరిన మర్డర్ కేసులు

ఐపిఎస్ అయ్యాక మర్డర్ కేసులు సవాల్ విసిరాయి. 2018 లో కాగాజ్ నగర్ లో ఇంఛార్జి ఎస్డిపిఓ గా పని చేశాను. అప్పట్లో ఓ వ్యక్తి కనబడటం లేదని మిస్సింగ్ కేసు నమోదు అయింది. విచారణలో భాగంగా మంత్రాల నెపంతో మిస్సింగ్ అయిన వ్యక్తిని చంపేసి బాడీకి రాళ్ళు కట్టి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు లో పడేసినట్లు





గుర్తించాము. వారం రోజుల్లో ఆ కేసును పూర్తి చేశాము. అలాగే మెదక్ జిల్లా చేగుంట లో ఏడాదిన్నర క్రితం జరిగిన ఓ వ్యక్తి మర్డర్ కేసును ఆకాశరామన్న ఉత్తరం ద్వారా కేసును పూర్తి చేసి ఇద్దరిని రిమాండ్ చేయడం జరిగింది.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి, మహనీయుల చరిత్రను ఆదర్శంగా తీసుకొని చదువు విలువ తెలుసుకోవాలి. స్కూల్ స్థాయి నుంచే పిల్లలు డ్రగ్స్, మద్యానికి అలవాటు పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. పట్టుదల, ఆత్మ విశ్వాసంతో లక్ష్యాన్ని పెట్టుకొని చదివితే ప్రతీ విద్యార్థి గమ్యాన్ని చేరుకోవచ్చు.

ఐపిఎస్‌గా ప్రస్థానం

2018 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన బాలస్వామి కాగజ్‌నగర్‌లో ఇన్‌చార్జి ఎస్‌డీపీవోగా పనిచేశారు. 2021లో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తరువాత రాచకొండ కమిషనరేట్‌లో ఎస్‌బీడీసీపీగా పనిచేశారు. అనంతరం సౌత్ వెస్ట్ జోన్ హైదరాబాద్ సిటీ డీసీపీగా పనిచేశారు. ప్రస్తుతం మెదక్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం

నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ-కొల్చారం



పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవులరాజిరెడ్డి అన్నారు. శుక్రవారం కొల్చారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులకు కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ల తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఆయన ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. గతంలో ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ గృహ నిర్మాణం కింద ఇండ్లు మంజూరు, భూమిలేని వారికి భూపట్టాలు, ఆరోగ్యశ్రీ, మెరుగైన విద్య, వైద్యం లాంటి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పదేళ్ల తర్వాత మరోసారి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని ఇది బీఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇప్పటికే ఆరు గ్యారెంటీ పథకాలను అంచెలంచెలుగా అమలు పరచడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు దేవన్న గారి శేఖర్, నాయకులు గోవర్ధన్, మహేశ్వర్ రెడ్డి, చందాపురం మధుసూదన్ రెడ్డి, అనిల్ కుమార్, అచ్చన్న పల్లి శ్రీరాములు, బండి మల్లేశం, అక్రం, రామ్ రెడ్డి, శ్రీకాంత్, బాలరాజ్, దొంకెన స్వామి, నర్సా గౌడ్, శ్రీశైలం, కొండ కృష్ణ, వెంకట్ గౌడ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అర్థికసాయం

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని వర్ధరాజ్ పూర్ గ్రామానికి చెందిన సాధమైన సత్యనారాయణ (52) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని విద్యుత్ శాఖలోపనిచేస్తున్న గొడుగు బాపురాజు పరామర్శించి రూ .10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కుమారస్వామి ,శ్రీకాంత్, శ్రీశైలం , బోళ్ల ప్రభాకర్, భూషణం, సత్యనారాయణ, రమేష్, చంద్రయ్య, బోళ్ళ చంద్రం, గణేష్, నర్సింలు, ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షున్ని కలిసిన రాంరెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డిని మర్కుక్ బిజెపి మండలాద్యక్షునిగా ఎన్నికైన సాయిరెడ్డి రాంరెడ్డి, బిజెపి మర్కుక్ మండల ఇంచార్జి , మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్యలు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న, అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకెళ్ళి బిజెపి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రేవంత్ రెడ్డి చిత్రపటానికి కి పాలాభిషేకం

ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్

నవ తెలంగాణ-కొమురవెల్లి



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మల్లన్న ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు మహిళలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేసిన సందర్భంగా డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కనకరాజు జనగాం శ్రీకాంత్, సార్ల లింగం, మల్లం బాలయ్య, కంకణాల ప్రవీణ్, ఎక్కలదేవి శ్రీనివాస్, జంగని రవి, మల్లం చందు, చింతల రమేష్, గొల్లపల్లి శ్రీనివాస్, స్వాములపల్లి రమేష్, చింతల పరశురాములు, ఏల ప్రవీణ్, గుండా మహేష్, గోదల నవీన్, లింగంపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు

పాఠశాలకు వాయిద్య సామగ్రి వితరణ

నవతెలంగాణ-వర్గల్ : మండలంలోని గౌరారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు బీజేపీ నాయకులు వాయిద్య సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మఠం మహిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వరూప రాణి, ఉపాధ్యా బృదం, ఎల్కాటి మధుసూదన్ రెడ్డి, మంకీ యాదగిరి, పూదరి ప్రశాంత్ గౌడ్, కృష్ణ చారి, బాగులు, శ్రీశైలం యాదవ్, రాము గౌడ్, నిఖిల్ రెడ్డి, కుమార్ యాదవ్, తదితరులు పాలగిన్నారు.

కాన్షీరాం జయంతి వేడుకలు

నవతెలంగాణ-బెజ్జంకి : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఎస్పీ అధ్వర్యంలో కాన్షీరాం జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నాయకులు తిరుపతి, పర్శరాం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ లేవల్ క్రీడల్లో 'ఆదర్శ' ప్రతిభ

నవతెలంగాణ-బెజ్జంకి

బ్లాక్ లేవల్ క్రీడల్లో మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందుకున్నారు. శుక్రవారం ఆదర్శ విద్యాలయ క్రీడా మైదానంలో బ్లాక్ లెవల్ 2024 ఏడాది ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల పోటీలు నిర్వహించారు. అయా క్రీడల్లో ఆదర్శ విద్యాలయ విద్యార్థులు పీఈటీ కనకారెడ్డి శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రధానాచార్యులు హర్జీత్ కౌర్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు ప్రధానం చేశారు. విద్యాలయ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభించిన ఎంపిపి

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని జప్తి శివనూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడిని తీర్చడానికి శుక్రవారం ఎంపిపి చిందం సబిత రవీందర్ బోరు మోటారును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత శంకర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, గ్రామ అధ్యక్షుడు యాదగిరి, నార్సింగి పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, అంజయ్య, బాల మల్లయ్య, సాలవ్వ ,సురేష్, నరేష్ ,రాజు స్వామి, కుమార్ పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన జెడ్పీటీసి

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి చెందిన బూరుగుపల్లి శివకుమార్ పెళ్లికి హాజరైన జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జీపీ స్వామి, గేరిగంటి బాబు, మోహన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డులో మజీద్ గల్లీలో సిసి రోడ్డు పనులకు ఆయన పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కృషితో మున్సిపల్ అన్ని రంగాల అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా స్థానిక కౌన్సిలర్ పంబల అర్చన శివకుమార్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. వార్డు అభివద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న వివిధ ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, నాయకులు నాగరాజు, గణేష్, చంద్రశేఖర్, సురేష్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశం గౌడ్, సాజిత్, సాయి మహేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం

- రాష్ట్ర ఫిషర్మెన్ కాంగ్రెస్ కార్యదర్శి గౌటీ బాబేష్

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్



అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునేది లేదని రాష్ట్ర ఫిషర్ మేన్ కాంగ్రెస్ కార్యదర్శి గౌటి బాగేష్ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నారాయణరావుపేట మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ , జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండ సురేఖ ,సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేసి మండల అభివృద్ధికి సహకరించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు బాగన్నా కరుణాకర్, గ్రామ శాఖ అధ్యక్షులు బిట్ల శ్రీనివాస్, కైలాస్, ప్రశాంత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినీలకు చట్టాలపై గజ్వేల్ షీటీం అవగాహన

నవతెలంగాణ-మర్కుక్



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు పెద్దపీట వేయడం జరుగుతుందని గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకుండా విద్యార్థులు చదువు పై ధ్యాస పెట్టాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలన్నారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు లాభాల గురించి కుణ్ణంగా తెలిపారు. ఉద్దేశపూర్వకంగాఎవరైన వెంబడింస్తే వెంటనే డయల్ 100,, సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ఎస్ వో బాహ్య లక్ష్మి, ఉపాధ్యాయులు సరిత, , గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుళ్లు శ్యామల, లావణ్య, కానిస్టేబుళ్లు మహేష్, రామచంద్రారెడ్డి. తదితరులున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో చేరడానికి దరఖాస్తులకు ఆహ్వానం

- గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

నవతెలంగాణ-సిద్దిపేట



తెలంగాణ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరం ప్రవేశం కొరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ లో నమూనా దరఖాస్తు గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక గిరిజన ,మహాత్మ జ్యోతిబాపూలే, వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2024 -25 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రథమ సంవత్సరం (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశం కోసం ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 12 చివరి తేదనీ, అదే నెల 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న, అర్హులైన విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రాంతీయ సమన్వయకర్త కే నిర్మల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి సునీత, వైస్ ప్రిన్సిపల్ ఎండి రిజ్వాన, అధ్యాపకులు ఎస్ వనజ, ఏ ఉమాదేవి, కే కావ్య తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ సహకారం గొప్పది



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శౌచాలయం నిర్మాణానికి యూనియన్ బ్యాంక్ అందించిన సహకారం గొప్పదని మున్సిపల్ కమిషనర్ కే ప్రసన్న రాణి అన్నారు. శుక్రవారం శౌచాలయాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకు వారు ఇలాంటి సహకారం చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిద్దిపేట ప్రాంతీయ నిర్వహణ అధికారి వికాస్, ప్రాంతీయ ఉపనిర్వహణాధికారి వీరరాఘవ, సంజయ్ కుమార్, ప్రదీప్ కుమార్, యురేకా, చంద్రిక, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతారాములు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, కిషోర్, హరిప్రసాద్, జ్యోతి, స్వప్న కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బిజెపి నాయకులు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ఇటీవల హుస్నాబాద్ మున్సిపల్ కమీషనర్ బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ మల్లికార్జున్ ను బీజేపీ హుస్నాబాద్ పట్టణ మాజీ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని పలు ప్రధాన సమస్యలను కమిషనర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల మాజీ అధ్యక్షుడు గోళ్లపల్లి వీరాచారి, హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు గాదాసు రాంప్రసాద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణానికి చెందిన కెమ్మసారం సంతోష్ కుమార్ ను బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు పట్టణ అధ్యక్షులు కోడూరి నరేష్ తెలిపారు. సంతోష్ కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ బి.జె.పి సిద్ధాంతం ఆదర్శాలకు పునరంకితమై, నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకటేశం, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి కేటాయించాలి

- యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు కమలాకర్

నవతెలంగాణ-మద్దూరు



భువనగిరి పార్లమెంట్ ఎంపీ టికెట్ జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కి కేటాయించాలని యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చేట్యారి కమలాకర్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ ఎంపీ సెగ్మెంట్ ఏర్పాటు అయిన అప్పటి నుండి నేటి వరకు ఒక్కసారి కూడా జనగామ నియోజకవర్గానికి చెందిన నేతలకు ఇవ్వలేదన్నారు. ఏడు నియోజకవర్గాల నాయకుల తో రాజకీయ సంబంధాలు ఉన్న నాయకులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కి భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని సీఎం రేవంత్ రెడ్డిలను కోరనున్నట్లు ఆయన తెలిపారు.

బైరాన్ పల్లి ఇందిరమ్మ గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని బైరాన్ పల్లి,గ్రామంలో ఇందిరమ్మ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించేందుకు గ్రామస్థాయిలో ఇందిరమ్మ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని. సీఎం రేవంత్ రెడ్డి ,నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఆదేశాల మేరకు ఇందిరమ్మ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ కమిటీ సభ్యులుగా దాసరి మనోజ్ కుమార్, కాలి శ్రీనివాస్, జంగిటి మనోజ్ కుమార్, భూషణమైన లక్ష్మయ్య, ఉప్పల కనక తార, లతో గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు,

మారిన ప్రభుత్వం... ఆగిన పనులు

- కంకర, డస్టు పోసి వదిలేశారు..
- దుమ్ముతో అవస్థలు పడుతున్న ప్రయాణీకులు





నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జిల్లాలో కాంట్రాక్టర్లు వివిధ పనులను మధ్యలోనే ఆపేశారు. దీంతో ఎంతో మంది ప్రజలు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. సిద్దిపేట నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట వరకు అప్పటి సిఎం కెసిఆర్ 2020 డిసెంబర్ లో సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట వరకు సుమారు 30 కిలో మీటర్ల మేర రూ.148 కోట్లతో ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటి సిఎం కెసిఆర్ నాలుగేండ్లు క్రితం హామీ ఇవ్వగా రోడ్డు నిర్మా ణ పనులకు గత యేడాది జనవరి 24న అప్పటి ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తన చేతుల మీదుగా శంకుస్థా పన చేశారు. మొదట దశలో సిద్దిపేట నుంచి చిన్నకోడూరు శివారు బ్రిడ్జి వరకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.66 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఎంతో అర్భాటంగా ప్రారంభించినా ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతే కాకుండా ఈ మధ్యన ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం పనులు మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లింగారెడ్డిపల్లి, పెద్దకో డూరు మధ్యలో దాదాపు కిలోమీటరు మేర రోడ్డు పనులు పూర్తి చేసి డివైడర్ నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికి సిద్దిపేట నుంచి లింగారెడ్డిపల్లి వరకు నిర్మాణం పనుల్లో భాగంగా రోడ్డుపై కంకర, డస్టు పోసి పనులు నిలిపివేసి నెలలు గడిచిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. లింగారెడ్డిపల్లి ఇందిరమ్మ కాలనీ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కోసం రోడ్డుపై పెద్ద గొయ్యి తీసి పనులను మధ్య లోనే నిలిపి వేశారు. ఇటు రోడ్డుపై కంకర, డస్టు పోసి వదిలేయ డంతో రోడ్డుపై నిత్యం దుమ్ము లేస్తుండడంతో ప్రయాణీకులు, ఇందిరమ్మ కాలనీలో రోడ్డు ముందున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డుపై కంకర రాళ్లు తేలడంతో ప్రయాణీకులు రోడ్డుపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. ప్రతి నిత్యం ఈ రోడ్డు గుండా వేలాది మంది ద్విచక్రవాహనాలపై, ఆటో లు, బస్సులో ప్రయాణం చేస్తుంటారు. రోడ్డుపై కంకర రాళ్లు తేలి, దుమ్ము లేస్తున్నా.. పెద్ద గొయ్యి తీసి బ్రిడ్జి పనులు మధ్యలో పూర్తిగా నిలిపి వేసినా పట్టించుకొనే వారు లేకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

సిద్దిపేట నుండి ఇల్లంతకుంట వరకు ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు లైన్ల రోడ్డును అధికారులు పట్టించుకోని, పనులు పూర్తి చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. కేవలం సిద్దిపేట నుండి చిన్నకోడూరు పోయే దారిలో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయని, మధ్యలో పనులు ఆగిపోవడంతో రోజూ వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోని కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయించాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి గుట్టుగా ఇసుక అక్రమ దందా

- మోయతుమ్మెద వాగు నుండి ఇసుక తవ్వకాలు
- రాత్రి సమయంలో లారీల్లో ఇసుకను తరలిస్తున్న మాఫియాదారులు
- టాస్క్‌ఫోర్స్ అధికారుల తీరుపై పలువురి అనుమానాలు

నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణను అరికట్టాలనే సదుద్దేశంతో ప్రత్యేకంగా టాస్కఫోర్స్ అధికారులను నియమించింది. టాస్కఫోర్స్ అధికారులు మొదట్లో అక్రమ ఇసుక వాహనాలపై, అక్రమ ఇసుక నిల్వలపై కొరడా ఝళిపించారు. అయితే కొద్దిరోజులకే యథారాజ తథా ప్రభు అనే చందగా మారిందని పలువురు అంటున్నారు. గురువారం మండల పరిధిలోని గాగీల్లపూర్,తోటపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుండి ఇసుక మాఫియాదారులు గుట్టుగా ఇసుకను ఇతర ప్రాంతాలకు అర్ధరాత్రి లారీల ద్వారా యథేచ్ఛగా తరలించడం టాస్కఫోర్స్ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇసుక రవాణపై అధికారుల చర్యలు మున్నాళ్ల ముచ్చటగానే మిగిలాయని అయా గ్రామాల రైతులు చెబుతున్నారు. దీంతో అక్రమ ఇసుక రవాణాపై ప్రభుత్వాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనలను నీరు గార్చకుండా చూడాలని కోరుతున్నారు.

నిర్మాణ పనులకు ఇసుక కొరత

మండలంలో ప్రభుత్వప్రభుత్వయేతర రంగ పనులకు ఇసుక కొరత ఏర్పడి నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ఇసుక మాఫియాదారులు ధనార్జనే ధ్యేయంగా గుట్టుగా లారీల ద్వారా ఇసుకను పట్టణాలకు తరలించడం అధికారులు తమ విధుల్లో అశ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది.ఇప్పటికైనా టాస్కఫోర్స్ అధికారులు మండలంలో గుట్టుగా సాగిస్తున్న అక్రమ ఇసుక రవాణ మాఫియాదారులపై కఠిన చర్యలు చేపట్టి తమ ఉనికిని నిలబెట్టుకోవాల్సిన అవశ్యకత ఉంది.

ఇసుక తరలింపునకు ఒక లెక్కా..?

అక్రమంగా ఇసుక తరలించే వాహనాన్ని బట్టి అధికారులు ఒక లెక్క నిర్ణయించి మాఫియాదారులకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు వినికిడి. మోయతుమ్మెద వాగు ఇసుకను మాఫియాదారులు ట్రాక్టర్ల ద్వార చిన్నకోడూర్ మండలం అనంతసాగర్ గ్రామ శివారులో ఏర్పాటుచేసిన అక్రమ ఇసుక నిల్వల స్థావరానికి తరలిస్తున్నారని అక్కడి నుండి మరో ఇసుక మాఫియాదారులు పట్టణానికి తరలిస్తున్నారని సమాచారం.

స్వశక్తి మహిళా సంఘాలకు ప్రాధాన్యత కల్పించాలి

- రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతుల కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మెంబర్ కన్వీనర్ గా ఉంటారని అన్నారు. గ్రామంలో 2, 3 మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళా సంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పించాలని, కమిటీ అధ్యక్షులు మెంబర్ కన్వీనర్ కలిసి పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లుల కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తారని, రెండు సంవత్సరాల పాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఉంటుందని, అమ్మ పాఠశాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని సిఎస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూనిఫార్మలు కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించామని, జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాంలో కుట్టే సామర్థ్యం గల మహిళా సంఘాలను గుర్తించి వారికి వెంటనే ఆర్డర్ అందించాలని సి ఎస్ కలెక్టర్లకు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద 25 వేల రూపాయల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చని, మిగిలిన పనులు జిల్లా సమాఖ్య కు కేటాయించాల్సి ఉంటుందని, డి ఎం ఎఫ్ టి, ప్రత్యేక అభివద్ధి నిధులు, సరిగా నిధులను వినియోగించుకొని పాఠశాలలో మౌలిక వసతులు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి అశోక్, డీఎస్సీడివో కవిత, డి డబ్ల్యూఓ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అన్ని సామాజిక వర్గాలకు సీఎం పెద్దపీట

నవతెలంగాణ-గజ్వేల్



దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న బడుగు బలహీన వర్గాలకు చెందిన కులాలను గుర్తించి ఆర్థిక ఎదుగుదల కోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌లు చేయాలని నిర్ణయం తీసుకుందనిసిద్దిపేట జిల్లా ముదిరాజ్ జెఎసి గజ్వేల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొదటిసారి ముదిరాజ్ ల అభివృద్ధికి ప్రత్యేకమైన కార్పోరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన బిసిశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ,గజ్వేల్ మాజీ శాసనసభ్యుడు తూంకుంట నర్సారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాసిరకమైన విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్

నవతెలంగాణ-మద్దూరు



రైతులకు నాసిరకం ఎరువులు విక్రయించే డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధి లోని మద్దూరు, వల్లంపట్ల, బైరాన్‌పల్లి,మర్మముల గ్రామాలలో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ క్రయ విక్రయాలను రికార్డు చేయాలని రైతులకు తప్పనిసరిగా రశీ దు ఇ వ్వాలని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామ కృష్ణ, ఏఈఓ లు రాకేష్ ,అఖిల్ ,కల్పన, రాధిక, అనూష, రైతులు పాల్గొన్నారు

నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతుల ప్రధానం

నవతెలంగాణ-నంగునూరు



స్కై ఫ్రీ, వైబ్రాంట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (సోలార్) సంస్థ ఆధ్వర్యంలో నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీష్ కుమార్ ఆధ్వర్యంలో సోలార్ సంస్థ సైట్ ఇన్చార్జ్ శివ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించి వారిలో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని అన్నారు.సోలార్ సంస్థ సీనియర్ టెక్నీషియన్ నర్సింహులు, నారాయణలు మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తున్న నర్మెట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభాపాటవ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు లాస్య, యశ్వంత్, సాత్విక్ లకు బహుమతులతో పాటు మిగతా విద్యార్థులకు వాటర్ బాటిల్స్, మిఠాయిలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సోలార్ సంస్థ ప్రతినిధులను ప్రాథమిక పాఠశాల నర్మెట ఉపాధ్యాయ బృందం అభినందించి వారిని శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సోలార్ సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కై ఫ్రీ, వై బ్రాంట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం భోజు సీతారాములు, కల్లాటి శ్రీనివాస్, గడిల శ్రీకాంత్, చిలువేరు పద్మ పెద్దిశారద తదితరులు పాల్గొన్నారు.

మెదక్ పార్లమెంటులో బిజెపి విజయం ఖాయం

- రఘునందన్ రావు

నవతెలంగాణ-గజ్వేల్



మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు మనోహర్ యాదవ్ తో పాటు పలువురు గజ్వేల్ నాయకులు రఘునందన్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో బిజెపి పార్టీకి భారీ మెజార్టీ తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకట్రాం రెడ్డి, గురువారెడ్డి, ఐల మహేందర్ తదితరులు ఉన్నారు.

బెజ్జంకి, గన్నేరువరం రోడ్డుకు రూ.32 లక్షలు



- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంపై హర్షం

నవతెలంగాణ-బెజ్జంకి

బెజ్జంకి, గన్నేరువరం మండలాల మధ్య 23 కి.మీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.32 లక్షల నిధులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వ విడుదల చేసిందని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆనందం వ్యక్తం చేశారు.శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పీఎం మోడీ,ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రాలు అభివృద్ధిలో పురోగతి సాధిస్తాయని..గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరివల్లే రాష్ట్రం అప్పుల పాలైందని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో పలు రోడ్ల నిర్మాణ పనులకు రూ.850 కోట్ల నిధులు విడుదల చేసిన పీఎం మోడీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి,కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో వ్యవహరించిన సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి కొమట రెడ్డి వెంకట రెడ్డికి బీజేపీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.బోయినిపల్లి అనిల్ రావు, ముస్కే మహేందర్,బుర్ర మల్లేశంగైని రాజు, సంగ రవి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

నవతెలంగాణ-నంగునూరు



పద్మ శాలి కులస్తుల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ చేయడం హర్షనీయమని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ అన్నారు.శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ పదేండ్లలో కేసీఆర్ రజాకార్ల పాలన అంతమైందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం సామాజిక తెలంగాణ, ప్రజా పాలన దిశగా అడుగులు వేస్తోందన్నారు . ఇందిరమ్మ రాజ్యంలో సబ్బండ వర్గాలకు సామాజిక న్యాయం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

- వంద రోజుల్లోనే 6 గ్యారంటీల అమలు
- నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి



నవతెలంగాణ-వర్గల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంకటయ్య గుప్త, మాజీ అధ్యక్షులు విశ్వనాథం గుప్త ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు వివిధ కులాలకు చెందిన16 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా ప్రోత్సహించడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రూ 10 లక్షల వ్యయంతో కార్పోరేట్ వైద్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, రూ 5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం, రూ 500 లకే గ్యాస్ సిలిండర్ అందజేత తదితర పథకాలు అమలు చేస్తుండడంతో పేదల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, నేతలు తోట ముత్యాలు, చేపూరి చంద్రమోహన్ గుప్త, అమర బాలేష్ గుప్త, కస్తు రాజేశ్వర్ గుప్త, రమేష్ గుప్త, లచ్చెలు గుప్త, విశ్వప్రసాద్ గుప్త, పెంటయ్య గుప్త, బద్రీనాథ్ గుప్త, శ్రీనివాస్ గుప్త, గౌరీ శంకర్ గుప్త, నూక సతీష్ గుప్త, పెద్ది శివ గుప్త, శ్రీకాంత్ గుప్త, రాంబాబు గుప్త తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్



నవతెలంగాణ-కొండపాక

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఎంపీటీసీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడీల కుమార్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ కోరారు ఈ సందర్భంగా సీఎం సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ శాలువాతో సన్మానించి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా కన్వీనర్ హరి, అశోక్ , నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు మంగి విజయ్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్, జోగులాంబ జిల్లా అధ్యక్షులు కృష్ణ , వనపర్తి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ , బచ్చలి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్వరంలో మహిళా ఉత్సవ్ వేడుకలు



నవతెలంగాణ -గజ్వేల్

అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం లైన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మహతి ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞ గార్డెన్‌లో మహిళా ఉత్సవ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని రంగాలలో సేవలు అందించిన పలువురు మహిళామణులను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మహతి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ కోర్ట్ జడ్జీ ప్రియాంక,లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ లక్ష్మి, లయన్ అమర్నాథ్ రావు, లయన్ నాగేష్ పంపాటి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, సెక్రటరీ సంజయ్ గుప్త, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్,లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మహతి అధ్యక్షురాలు సుమలత, లయన్ గుడాల పద్మజ,లయన్ శైలజ, లయన్స్ క్లబ్ సభ్యులు,పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సమతుల్య ఆరోగ్యం

నవ తెలంగాణ-దుబ్బాక

పోషక విలువలున్న ఆహారంతో పాటు చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సమతుల్య ఆరోగ్యాన్ని పొందవచ్చని పోషన్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటప్రసాద్, ఐసీడీఎస్ బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్యాంసన్ అన్నారు. బాలికల్లో రక్తహీనత లోప నివారణకు ఆకుకూరల్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేటలో వార్డు కార్యాలయంలో పోషణ పక్షం అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీల ఆరోగ్యం,శిశువువులు, చిన్నపిల్లల ఆహార పద్ధతులు ,ప్రాంతీయ, స్థానిక ఆహార పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో 7, 8 వార్డుల కౌన్సిలర్ దివిటి కనకయ్య దుబ్బాక బాలకృష్ణ గౌడ్, కో-ఆప్షన్ సభ్యురాలు పెంటమ్మ సూపర్వైజర్ స్వరూప, ఏఎన్ఎం పుష్ప, రామక్కపేట సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలు, పలువురు పాల్గొన్నారు.



అభివృద్ధి నిధులను 12 వార్డులకు కేటాయించాలి

సీపీఐ(ఎం)మండల, పట్టణ కార్యదర్శులు

నవతెలంగాణ-చేర్యాల



కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల కేటాయించిన అభివృద్ధి నిధులను చేర్యాల పట్టణంలో ఉన్న 12 వార్డులకు కేటాయించాలని సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజులు డిమాండ్ చేశారు. 12 వార్డులలో పనులు పనులు చేయించకుండా కేవలం తన సొంత పేరుతో గల కేపిఆర్ నగర్ కాలనీలో రూ.80 లక్షల నిధులతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేయడంతో మరో సారి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దుర్బుద్ధి బహిర్గతమైందని వారు విమర్శించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వెంకట మావో, నాగరాజులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పేరుతో ఇటీవల రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఏ ప్రభుత్వ అధికారి ప్రమేయం లేకుండా అంతా తానే అనే విధంగా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. చేర్యాలలో 12 వార్డులు సుమారు 30 వేల జనాభా గల మున్సిపాలిటీ లో రూ. 80 లక్షల విలువ గల అభివృద్ధి పనులను ఒకే ఒక్క ప్రాంతం సుమారు 100 ఓటర్లు సరిగా లేని కేపిఆర్ నగర్‌కు కేటాయించడంతో తన స్వార్థ దుర్బుద్ధి మరోసారి బహిర్గతమైందన్నారు. ఇప్పటికైనా చేర్యాల మున్సిపాలిటీకి వచ్చిన నిధులను అన్ని వార్డులలో సమానంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేర్యాల పట్టణ కేంద్రంలో13 ఎకరాల స్థలంలో వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ అవసరాలకు (గుడి, బడి, ఆట స్థలము, పార్కు) అందులో నివసించే ప్రజా అవసరాల నిబంధనల ప్రకారము స్థలమును వదలకుండా వెంచరు నిర్వహించేటప్పుడు నల్లా, కరెంటు కనెక్షను, రోడ్ల నిర్వహణ ఎలాంటిది పట్టించుకోకుండా గాలికి వదిలేసి ప్రస్తుతం మొత్తం చేర్యాల పట్టణానికి వచ్చిన నిధులను ఈ ఒక్క కాలనీ లోనే కేటాయించి ప్రభుత్వ సొమ్ముతో నేను చేపిస్తున్న అనే విధంగా తన సొంతానికి మలుచుకోవడానికి తను ఆడుతున్న నాటకాన్ని చేర్యాల పట్టణ మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ,ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ పనులను మున్సిపాలిటీ అధికారులు వెంటనే నిలిపివేసి వచ్చిన నిధులను 12 వార్డులలో అభివృద్ధి పనులు జరిగేటట్లు చూడాలని లేనిపక్షంలో తమ పార్టీ చేర్యాల ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున కొమ్మూరి ప్రతాపరెడ్డి చేస్తున్న నిధుల మళ్లింపు అవినీతి బాగోతానికి అడ్డుకట్ట వేసే విధంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఇప్పకాయల శోభ, బండకింది అరుణ్ కుమార్, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, ఎర్రబోసు అశోక్, ,యాడారం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలిమల పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలలో గురువారం నిర్వహించిన శ్రీ లక్ష్మీ అనంత పద్మ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, కళ్యాణ ఉత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్ మెట్టు కుమార్ తెల్లాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ లలిత వైస్ చైర్మన్ రాములు గౌడ్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కమిటీలు

మద్దూరు జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను వేయనున్నట్లు మద్దూరు జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో మండల సమైక్య వివోలకు, సీసీలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో ముగ్గురు చొప్పున కమిటీ సభ్యులు ఉంటారని ఆయన తెలిపారు. పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థుల తల్లులలో ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంటుందని. ఆ కమిటీకి గ్రామ సంఘం అధ్యక్షురాలు అధ్యక్షులుగా కొనసాగుతారన్నారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. సామాజిక బాధ్యతలు ఆర్థిక బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. పాఠశాలలకు కనీస మరమ్మతులు అనగా రూ.25 వేల లోపు ఈ కమిటీల ద్వారా పనులు చేపట్టవచ్చని ఆయన తెలిపారు. పదవీ బాధ్యత రెండు సంవత్సరాలకు ఒకసారి మార్పు జరుగుతుందన్నారు. కమిటీ ప్రోత్సాహంతో 100% స్కూల్లో విద్యార్థులను పెంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రామ్ మోహన్, ఎంపీవో కాజా మొయినుద్దీన్ పి ఆర్ ఏ ఈ వినయ్ కుమార్ రెడ్డి, ఏపిఎం బాబురావు, సీసీలు అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి సర్వే చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం

నవతెలంగాణ-కొండపాక



మండలంలోని ఖమ్మం పల్లి గ్రామంలోని 1061 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఆర్డీవో ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఖమ్మంపల్లి ఎంపీటీసీ యాదగిరితో పాటు పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. గత కొంతకాలంగా గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారని దీని విషయంలో సర్వే చేసి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామ అవసరాలతో పాటు పేదలకు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంలో ప్రజాభవన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం సర్వే చేసి హద్దులు గుర్తించాలని ఆర్డిఓ ఆదేశించినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని వారు ఆరోపించారు. ఆర్ఐ సర్వేయర్లపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ మహిళా సంఘాలదే

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మహిళా సంఘాలు నిర్వహణ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది. గతంలో పాఠశాలల చైర్మన్‌గా విద్యార్థుల తల్లిదండ్రులు ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యార్థుల సంఖ్య పెంచుతూ అన్ని విధాల సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక చేపట్టింది. ఈ కమిటీ ముఖ్యంగా పది అంశాలపై పనిచేయాల్సి ఉంటుంది. ఐదు క్లాసులో ఉన్నట్లయితే 15 మంది కమిటీ మెంబర్‌లు, వివో అధ్యక్షురాలు కమిటీ చైర్మన్‌గా స్కూల్ ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా నిర్ణయించారు. పాఠశాలలో కమిటీల ఏర్పాటులో ముగ్గురిని ఎస్సీ ఎస్టీ మెంబర్ లుగా తప్పకుండా ఉండేలా నిర్ణయించింది.

కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

ఎంపీడీవో పులుగు వేణుగోపాల్ రెడ్డి

హుస్నాబాద్ మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పేరుతో నూతన కమిటీలను వేసేందుకు మహిళా సంఘాల సీసీలు, సిఐలు చర్యలు చేపట్టాలని హుస్నాబాద్ ఎంపీడీవో పులుగు వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘాల సీసీలు, సీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రాథమిక మౌలిక సదుపాయాలు బలోపేతం చేయడం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం తాగునీటి సౌకర్యాలు కల్పించడం, మరమ్మతు పనులు చేపట్టడంపై వివరించారు. ఇప్పటికే ఉన్న పనిచేయని టాయిలెట్లు పునరుద్ధరణ, తరగతి గదుల విద్యుదీకరణ, పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ ప్యానల్ ఏర్పాటు అమ్మ ఆదర్శ కమిటీలదే బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శ్రీనివాస్, ఎంపీఓ సత్యనారాయణ, ఏఈపిఆర్ స్నేహ, సీసీలు విద్యాశాఖ నుంచి సిఆర్‌పిలు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరు దాన్యాలతోనే ఆరోగ్యం పదిలం

నవతెలంగాణ-జగదేవపూర్



పోషకాలతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అంగన్‌వాడి సూపర్‌వైజర్ రజిత అన్నారు. పోషక పక్ష ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిగుల్ గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాలతోనే పిల్లలు గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని ప్రతి ఒక్కరు చిరుద్యాన్యాలను అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రుక్మిణీ, కళ, కనకవ్వ, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంగిస్తున్న డీఈఓ

బీఎస్పీ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కానుగుల రమణాకర్

నవతెలంగాణ-గజ్వేల్



ప్రాథమిక విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న జిల్లా విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని గజ్వేల్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షులు కానుగుల రమణాకర్ డిమాండ్ చేశారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకుల అండదండలతో జిల్లా విద్యాధికారి ప్రాథమిక విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోందని తెలిపారు. జిల్లాలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులను ప్రభుత్వ కార్యక్రమాలకు వివిధ ప్రైవేట్ పనులకు వాడుతూ ప్రాథమిక విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాల్సిన జిల్లా విద్యాధికారే విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘన చేయడమేమిటని ప్రశ్నించారు. ఇదే అదునుగా భావించిన వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్థానికంగా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన వదిలిపెట్టి ప్రభుత్వ కార్యక్రమాలకు తిరగడమేంటని ప్రశ్నించారు. సదరు ఉపాధ్యాయ సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా విద్యాధికారే నిమ్మకు నిరెత్తినట్టు ప్రవర్తిస్తే రాష్ట్ర ఉన్నతాధికారులను పిర్యాదు చేస్తామని అయినప్పటికీ మార్పులేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలి

సమావేశానికి సమాచారం ఇవ్వని అధికారులు

అదిలోనే అవహన శూన్యం

నవతెలంగాణ-మర్కుక్



ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లను సత్వరమే ఏర్పాటు చేయాలని మర్కుక్ ఎంపీడీవో అఫ్జరోద్దిన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్ రైతు వేదికలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పై మర్కుక్ ఎంఈవో ఉదయ బాస్కర్ రెడ్డి,ఐకెపి ఎంపీఎం కిరణ్‌తో కలసి మహిళ సంఘాలకు అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూనిఫామ్ కుట్టే బాధ్యతను స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయిస్తారని, మండలంలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాంలో కుట్టే సామర్థ్యంగల మహిళా సంఘాలను గుర్తించి వారికి వెంటనే ఆర్డర్ అందించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్ సౌకర్యం కల్పన వంటి మౌలిక వసతులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జూన్ 10వరకు కల్పించాలని తెలిపారు. అమ్మ ఆద ర్శ పాఠశాల కమిటీల వద్ద 25వేల రూపాయల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చని, పాఠశాలలో చేపట్టిన పనులకు లక్ష రూపాయల వరకు ఎంపీడీవో పరిశీలించి బిల్లులు చెల్లిస్తారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుం టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజలింగం, వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డి,ఐకెపి సిసిలు , రమేష్, హరిచంద్, నాగరాజు, కవిత, మహిళల సంఘాల సభ్యులు,తదితరులున్నారు.

సమావేశానికి సమాచారం ఇవ్వని అధికారులు

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను కార్యక్రమాన్ని చేపట్టింది. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్ రైతు వేదికలో మర్కుక్ ఎంపీడీవో అఫ్జరోద్దిన్, ఎపీఎం కిరణ్,ఎంఈవో ఉదయ భాస్కర్ రెడ్డిలు మహిళ సంఘాల సభ్యలకు సమాచారం ఇవ్వకుండా తూతూ మాత్రంగా అవగహన సదస్సు నిర్వహించి చేతులు దులుపుకున్నారు.స్థానిక విలేకర్లకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

దీనస్థితిలో కుటుంబం

దాతలు ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ పట్టణంలోని శ్రీరాం రాజేష్ నిరుపేద కుటుంబం తన చిన్నతనం నుంచి విద్యాభ్యాసానికి దూరమై కులవృత్తిని ఎంచుకొని జీవనం కొనసాగిస్తున్నాడు శ్రీరాం రాజేష్. నాన్న ఆరోగ్యం బాగా లేనందున ఎన్నో హాస్పటల్లో ఎన్నో పరీక్షలు చేయించగా ఎ కార్పొరేట్ హాస్పిటల్ కి వెళ్లిన ఈ వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని అక్కడి డాక్టర్లు చెప్పడంతో వైద్యం చేయించే స్థితిలో లేక ఏం చేయాలో తెలియక కుటుంబ సభ్యులు కన్నీరుతో బోరున విలపిస్తునారు. తమ ఉన్న ఆర్థిక స్తోమతతో కూతురి వివాహం చేసినపటికి కట్టుకున్న భర్త మద్యానికి బానిసై భార్యను సరిగా చూసుకోకపోవడంతో పుట్టింటి వారికి భారంగా మారింది. నేటి సమాజంలో కార్పొరేట్ స్థాయిలో సెల్యూట్ సెంటర్లు ఏర్పడడంతో కుల వృత్తిని నిర్వహించడం కూడా కత్తి మీద సాములగా మారింది. వారికి ఉన్న స్థాయిలో గల్లీలో హెయిర్ కటింగ్ డబ్బాను ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. కులవృత్తి చిన్నచూపు గురవుతూ ఏం చేయాలో తెలియక ఓవైపు తన నాన్న ఆరోగ్యం నిలకడగా లేనందున మరోవైపు కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి లేక బోరున విలపిస్తూ ఆపన్న హస్తం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. దాతలు ఆదుకోవాల్సిన ఫోన్ నెంబర్ 8500037111 ఫోన్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

వరి పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్

నవతెలంగాణ-చేర్యాల



వరి పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని దానంపల్లి గ్రామంలో శుక్రవారం వరి, మొక్కజొన్న పంటలను ఆయన సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటున్నందున మొదటి దశ అనగా అంకురం ఏర్పడిన పది రోజుల లోపల గుళికలు వేసుకుంటే చాలా వరకు తెళ్ళకంకి రాకుండా నివారణ చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. అంకురం ఏర్పడే దశలోనే పురుగు ఉధృతి గమనించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని,వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అఫ్రోజ్, రైతులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయంలో తల్లికి విశిష్ట స్థానం

నవతెలంగాణ-కొండపాక



భారతీయ సంప్రదాయంలో తల్లికి ఎంతో విశిష్ట స్థానం ఉందని కొండపాక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విటల్ నాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో మాతృవందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు వాళ్ళ మాతృమూర్తులకు వందనం చేసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి ఆశీర్వాదంతో ఏ కార్యక్రమం చేపట్టిన విజయవంతమవుతుందని పేర్కొన్నాడు. విద్యార్థులు తమ జీవితంలో పది సంవత్సరాల నుంచి కొనసాగిన విద్యార్జన ద్వారా మొదటి సర్టిఫికెట్ పొందడానికి చేసే ప్రయత్నం తల్లిదండ్రుల ఆశీర్వాదంతో దిగ్విజయం కావాలని ఆకాంక్షిస్తూ మాతృ వందనం కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మాతృ వందనం కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులు మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల సరైన అవగాహన కలిగి వారి తల్లిదండ్రుల పట్ల, సమాజం పట్ల గౌరవం పెంపొందించుకుంటారన్నారు. నైతిక విలువలు కొరవడిన నేటి సమాజంలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా తల్లిదండ్రుల పట్ల గౌరవం పెంపొందిస్తే రేపు వృద్ధాశ్రమాల అవసరం ఉండదన్నారు. దేవుడు ప్రతి చోట ఉండలేకనే తన స్థానంలో తల్లిని ఇచ్చాడన్నారు. అలాంటి తల్లి ఆశీర్వాదంతో తమ పాఠశాల దిగ్విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 10 జిపిఎ సాధించే విధంగా అనేక కార్యక్రమాలను నిర్వహించి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విటల్ నాయక్‌ను, మహిళా ఉపాధ్యాయులు హారతి, సత్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు రఘువర్ధన్ రెడ్డి, రామస్వామి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాల మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్

నవ తెలంగాణ-సిద్దిపేట

డీఎస్సీ కోసం ఉచిత శిక్షణ కోసం టీఎస్ ఎస్సి స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిని సిహెచ్ కవిత , స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ లు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డైట్ లేదా బి.ఎడ్ పూర్తి చేసి, టెట్ ఉత్తీర్ణత అయి, ఎస్సీ అభ్యర్థులై ఉండాలని తెలిపారు. ఈ నెల 12 నుంచి 26 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచితంగా రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు బీజేపీ కుట్ర

నవతెలంగాణ-మర్కుక్



ఎమ్మెల్సీ కె.కవిత అరెస్టు వెనుకాల బీజేపీ కుట్ర వుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిహెచ్ రాజేశ్వరరావు(రాజు రావు) ఆరోపించారు. శుక్రవారం 'నవతెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ పార్లమెంటు ఎన్నికలలో లబ్ది పొందడానికి ఎమ్మెల్సీ కె.కవితను అరెస్టు చేశారన్నారు. కవిత అరెస్టును తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండిస్తుందన్నారు. రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ అడ బిడ్డను అరెస్టు చేయడం నీతిమాలిన చర్య అని అన్నారు. కవితను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-అక్కన్నపేట



హుస్నాబాద్ నుంచి రామవరం వరకు 11 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు రూ: 25 కోట్లు మంజూరు చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అక్కన్నపేట సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంగ రాకేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆనతి కాలంలోనే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో హుస్నాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆకాంక్షించారు.

వాయిదా పడిన మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల సర్వసభ్య సమావేశం సభ్యులు రాకపోవడంతో వాయిదా పడింది. శుక్రవారం సమావేశం జరగాల్సి ఉండగా ఒక్క సభ్యుడు కూడా సమావేశానికి రాకపోవడంతో అధికారులు కొద్దిసేపు వేచి చూసి సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్ బాబు నాయక్, ఎంపీఓ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కానీ సభ్యులు ఎవరు హాజరు కాలేదు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

నవ తెలంగాణ-దుబ్బాక

పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ వార్డులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మూడవ వార్డు కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి శుక్రవారం పరీక్ష సామాగ్రిని అందజేశారు.విద్యార్థులు శ్రద్ధగా చదివి పరీక్షలు బాగా రాయాలన్నారు. చదువుకున్న పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు ఖ్యాతిని తెచ్చేలా మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు బెలిదే శ్రీనివాస్ రావు, పాఠశాల సిబ్బంది, శ్రీ రాజ్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై శిక్షణ

నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిర్వహణపై వివో అధ్యక్షులకు, వివోఏల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కొండపాక సమీకృత మండల భవన సముదాయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులు మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి శ్రీనివాస్ ఈ డబ్ల్యు ఐ డి సి ఏఈ రాజు హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్ కమిటీ విధివిధానాలను వివరించారు. గ్రామాలలోని గ్రామైక్య సంఘాలలో గల వివో అధ్యక్షురాలు గ్రామాలలోని పాఠశాలలకు సంబంధించి చైర్ పర్సన్‌గా ఉంటారన్నారు. వీరితోపాటు పాఠశాలలో గల స్కూల్ హెడ్మాస్టర్ కమిటీ కన్వీనర్‌గా ఉంటారన్నారు. వీరు పాఠశాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాలు అనగా తాగునీటి, టాయిలెట్స్ బాత్రూమ్స్, లైట్స్ , ఫ్యాన్స్, టాప్స్ వివిధ రకాలైన స్కూలుకు సంబంధించిన అన్ని మరమ్మతులను నిర్వహించాల్సి ఉంటుంది. తరగతికి మెంబర్స్ ముగ్గురు చొప్పున ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల తల్లులు మాత్రమే ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. పాఠశాలలో ఉన్న అవసరాలను బట్టి వారు తనిఖీ చేసి ఒక నివేదిక ద్వారా పాఠశాలను అభివృద్ధి చేయుటకు కమిటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వి ఓ అధ్యక్షురాలు, గ్రామ సంఘ సహాయకులు , సీసీలు యాకుబ్, లింగం, అశోకు, బాలకిషన్, కవిత ,సుల్తానా, జ్యోతి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

నవతెలంగాణ-జగదేవపూర్

రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అందించే గాలికుంటు వ్యాధి నివారణకు ఇచ్చే ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వెటర్నరీ అధికారి శ్వేతా అన్నారు. మండల పరిధి ఇటిక్యాలలో శుక్రవారం గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మాట్లాడుతూ. పాడి రైతులకు అధిక ఆర్థిక నష్టం చేకూర్చే గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల వ్యాప్తంగా పశువులకు వేస్తున్న గాలి కుంటూ నివారణ టీకాలను రైతులు విధిగా పశువులకు వేయించాలన్నారు. గ్రామంలో 35 తెల్ల, 97 నల్ల పశువులకు టీకాలను వేశామన్నారు. ఈ కార్యక్రమంలో విఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, గోపాలమిత్ర స్వామి రైతులు పాల్గొన్నారు


నేతన్నలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

నవ తెలంగాణ-దుబ్బాక

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పద్మశాలి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం హర్షనీయమని, నేతన్నలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ నరేందర్‌లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే 16 కులాల కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమం కోసం రూ.1 కోటి ప్రకటించి మంజూరు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలనలో అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. దివంగత మంత్రి చెరుకు ముత్యంరెడ్డి,కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి,మాజీ వీవర్ సెల్ అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ లు దుబ్బాక ప్రాంతంలో ఉన్న పద్మశాలీల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్,యూత్ జనరల్ సెక్రెటరీ ఆకుల భరత్, మున్సిపల్ కార్యదర్శి మంద శ్రీనివాస్,మట్ట కిషన్ రెడ్డి,ఆడేపు దుబ్బయ్య,మెతుకు ప్రభాకర్,ఎల్లారం రవి,ధ్యావనపల్లి రవి,వడ్లకొండ రమేష్,జిందం మల్లేశం, దుద్దెడ శేఖర్, బిల్ల బాలరాజు, బిల్ల రాములు, పలువురు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని చెంచల్ చెర్వుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భీంరెడ్డి రాజిరెడ్డి తల్లి భీంరెడ్డి రాజవ్వ ఇటీవల మృతి చెందారు. రాజవ్వ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

రాజన్న సన్నిధికీ పాదయాత్ర



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం కొండంరాజ్ పల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మ్యాక రజినీకాంత్ కొండంరాజ్ పల్లి గ్రామం నుండి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంకు కాలినడకన బయలు దేరాడు.శుక్రవారం నంగునూరుకు చేరుకున్న రజినీకాంత్ ను టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఐతే వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానంకు కాలినడకన వచ్చి మొక్కు చెల్లించుకుంటానని మొక్కిన మొక్కు తీర్చుకుంటున్న రజినీకాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాగు శ్రీకాంత్ యాదవ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గాండ్ల రమేష్, బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, నంగునూరు గ్రామ శాఖ అధ్యక్షులు అనరాజు నాగరాజు,తిరుపతి,రాజేశం, ద్యాగల రాజు, బాలయ్య, వేణు గౌడ్, గౌరబోయిన రాజు,చాంద్ పాషా,మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

మర్కుక్ ఎంఈవో ఉదయ భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

మార్చి18 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నట్లు మర్కుక్ మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశామన్నారు. మండలంలోని చేబర్తి, దామరకుంట, మర్కుక్, పాములపర్తి,మర్కుక్ కస్తూర్బా బాలికల పాఠశాలకు గాను 235 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం మర్కుక్, పాములపర్తి పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.12 మంది ఇన్విజిలేటర్లు,సిఎస్ లు ఇద్దరూ, డిఈవోలి ఇద్దరు ఉన్నారు.పరీక్షల కేంద్రాలలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా పూర్తి ఏర్పాట్లను చేశామన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్



నవతెలంగాణ -దుబ్బాక

రానున్న పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, డబ్బు,మద్యం ప్రవాహంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి,జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ సూచించారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల సముదాయంలో దుబ్బాక శాసనసభ పరిధిలోని ఎన్నికల పరిశీలన బృందాలతో అదనపు కలెక్టర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఎఫ్ఎస్ టీ ,ఎస్ఎస్ టీ ,వీఎస్ టీ ,అకౌంటింగ్ టీం,ఎమ్ సీసీ,పోలీసు సిబ్బందికి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో పోలీస్ నోడల్ ఆఫీసర్ కమలాకర్,దుబ్బాక తహసీల్దార్ నల్ల వెంకటరెడ్డి,మున్సిపల్ కమిషనర్ కే.రమేష్ కుమార్,దుబ్బాక,తోగుట,రామాయంపేట సీఐ లు,మాస్టర్ ట్రైనర్ భాస్కర్,ఏ ఈఓ శ్రీనివాస్ రెడ్డి,పలువురు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఇష్టపడి చదువుకోవాలి



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుకోవాలని, మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని హుస్నాబాద్ ఎస్ ఐ తోట మహేష్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీటీమ్ నిర్వహించే విధులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, సైబర్ నేరాల పై హుస్నాబాద్ ఎస్ఐ మహేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎవరు కూడా బాల్య వివాహాలు చేసుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీటీమ్ నెంబర్ 8712667434 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ విజయ్ రెడ్డి, హుస్నాబాద్ షీటీమ్ బందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

ఉపసర్పంచ్ కోతి రామవ్వను సొసైటీ చైర్మన్ కే.హరికృష్ణ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డిలు పరామర్శించారు. శుక్రవారం మండలంలోని వర్ధరాజ్ పల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కోతి రామవ్వ భర్త కోతి యాదయ్య అనారోగ్యంతో బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న సొసైటీ చైర్మన్ కే హరికృష్ణ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డితో కలిసి పరామర్శించి, రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. యాదయ్య మరణం పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. పరామర్శించిన వారిలో చెత్రి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, పులి బైర య్య, జనార్దన్ రెడ్డి, దేవయ్య, కనకయ్య తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ మహిళలకే



నవతెలంగాణ -నంగునూరు

అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ మహిళ సంఘాలకే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నంగునూరులోని మండల సమైఖ్య కార్యాలయంలో పాఠశాలల నిర్వహణపై మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకే పాఠశాలల నిర్వహణ మహిళకు ఇస్తున్నరన్నారు. ఇప్పటి నుండి పాఠశాల కమిటికి చైర్మన్‌గా వీఓ అధ్యక్షులు, పాఠశాల హెచ్ కన్వీనర్ గా, వీరితో పాటు ఒక క్లాసుకు ముగ్గురు మెంబర్ల చొప్పున పదిహేను మంది సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఏపీఎం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళలకు ఇస్తున్నారన్నారు. గ్రామాలలో ఒక గ్రూపుగా ఏర్పడి స్కూల్ యూనిఫామ్స్ కుట్టి మహిళల సత్తా చూయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, ఏపీఎం ఆంజనేయులు, పీఆర్ఏఈ శశాంక్, సీసీ లు లింగం, శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు ఆయా గ్రామాల వీఓ అధ్యక్షులు, వీఓలు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం అల్పాహారం పథకాన్ని కొనసాగించాలి

చిన్నారెడ్డికి డిబిఎఫ్ నేత శంకర్ వినతి



నవ తెలంగాణ - మిరుదొడ్డి

గత ప్రభుత్వం ఎన్నికల ముందు అమలులోకి తెచ్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిఎం అల్పాహారం పథకాన్ని తిరిగి కొనసాగించాలని తెలంగాణ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ విన్నవించారు.శుక్రవారం సిఎం ప్రజావాణిలో చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మండలానికి ఒక పాఠశాల చొప్పున పైలెట్ గా అల్పాహారం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.ప్రభుత్వం పాఠశాల లకు వచ్చే పిల్లలు ఉదయం పూట ఏమి తిని రాకపోవడం వల్ల చాలా పాఠశాలలో ప్రార్ధన సమయంలో సొమ్మసిల్లి పడిపోతున్నారన్నారు. ఉదయం అందించాల్సిన రాగి జావ చాల పాఠశాలలో ఇంటర్‌వెల్ కు అందిస్తున్నారన్నారు. పేద పిల్లల ఆకలి తీర్చే రాగి జావను ప్రార్ధన తర్వాత వెంటనే అందించాలని కోరారు.. సిఎం అల్పాహారం పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టి పేద పిల్లల ఆకలి తీర్చాలని కోరారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ఎస్ ప్యాకెట్లు అందించాలి



నవతెలంగాణ - జగదేవపూర్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఎండ వేడిమి నుండి కొంతవరకు ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్ఎస్ ప్యాకెట్లు ఉపయోగపడతాయని, కూలీలందరికి తప్పని సరిగా పంపిణీ చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి కోరారు. శుక్రవారం జగదేవ్ పూర్ మండల్ నిర్మల్ నగర్ ఉపాధి హామీ కూలీల పని ప్రదేశానికి వెళ్ళిన సందర్భంగా ఆయన అధికారులను కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్న నిర్మల్ నగర్ 93 జాబ్ కార్డుకుటుంబాలుంటే అందులో 149 మంది కూలీలు క్రియశీలకంగా పనిచేస్తున్నప్పటికి 2023 - 24 ఆర్థిక సంవత్సరం 15 రోజులలో పూర్తికావొస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కుటుంబం కూడా 100 రోజులు పూర్తిచేయలేదన్నారు. మండలంలో క్రియాశీలకంగా 5893 జాబ్ కార్డులు ఉండగా ఆ కుటుంబాలలో 10,405 మంది క్రియాశీలక కూలీలు (76 కుటుంబాలు) మాత్రమే 100 రోజులు పూర్తిచేశారన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వృత్తిదారుడు ఆత్మహత్య



నవతెలంగాణ -గజ్వేల్

రెక్క ఆడితే గాని డొక్కాడని పరిస్థితులలో వడ్ల కమ్మరి కుటుంబాలు చాలా వరకు ఉన్నాయి అలాంటి కుటుంబానికి చెందిన గజ్వేల్ మండలం పిలిచాడు గ్రామంలో రామాచారి ఆత్మహత్య ప్రయత్నం చేశారు. ఈనెల 12న గ్రామ సమీపంలో గడ్డి మందు తాగి కొట్టుమిట్టాడుతున్నారు. దీని గమనించిన స్థానికులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సొంత ఇల్లు లేదు. భూమి లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కులవృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామాలలో సైతం వడ్ల పని పూర్తిగా అంతరించిపోయిందని గ్రామస్తులు తెలిపారు. పని చేయమని అడిగేటోడు లేడు కూలి చేయకపోతే ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో జీవితంపై విరక్తి చెంది రామాచారి ఆత్మహత్య పాల్పడ్డారు. కుటుంబ పెద్ద కోల్పోవడంతో భార్య కుమారుడు కుమార్తెలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ప్రజా ప్రతినిధులు , రాజకీయ నాయకులు ఆదుకోవాలని అలాగే ప్రభుత్వం స్పందించి రామాచారి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయాన్ని ఫోన్ నెంబర్ 9000045487, 9165666888, 9160949414 పంపించాలని కోరారు.

ఘనంగా మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి



నవ తెలంగాణ - మిరుదొడ్డి

సామాజిక రాజకీయ సాంస్కృతిక సమానత్వానికి పునాది వేసిన సామాజిక సమానత్వ సిద్ధాంతకర్త మాన్యశ్రీ కాన్షీరాం అని డి.ఎస్.పి మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల దీపక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హమారా రాజ్ తుమారా నహి చలేగా నహి చలేగా అంటూ అగ్రకుల రాజకీయ నాయకులని భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తి అన్నారు. డాక్టర్ విశారదన్ మహరాజ్ గత 13 సంవత్సరాలుగా సాంస్కృతిక ఉద్యమం నిర్మాణం చేసి గత ఏడాది కాన్షీరాం జయంతి రోజున ధర్మ సమాజ్ పార్టీని స్థాపించారని తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఏప్రిల్ 30వ తేదీ వరకు "పీడిత ప్రజల విముక్తి ప్రదాతల జన్మదిన ఉత్సవాలు" నిర్వహజంచబోతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల నాయకులు చందు, నవీన్, రవి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేతకి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ. 14.56 లక్షలు



నవతెలంగాణ -ఝరాసంగం

మొగలి వనంలో నెలకొన్న శ్రీ పార్వతీ సమేత కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం శివరాత్రి జాతరకు సంబంధించి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో వేసిన నగదును లెక్కించగా రూ.14,56,956/- వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబ రాజరాజేశ్వరి ట్రస్ట్,ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి రంగారావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, ఆలయ సిబ్బంది, అర్చకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాన్సిరాం 90వ జయంతి వేడుకలు



నవ తెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రం ఐబిలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాన్షిరామ్ 90వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గా ప్రసాద్, గౌరవ అధ్యక్షులు ఎం. విజయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సంచుల మాట్లాడుతూకాన్షిరామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి. అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కైతాళాపురం రాములు, కార్యదర్శులు ఆర్. అశోక్, అనసూయ, నవీన్, పురుషోత్తం, యాదగిరి, యోహాను, గోపాల్ నాయక్, సాగర్, దళిత నాయకులు దేవాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మండలంలోని శుక్రవారం ర్యకల్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలి కుంటు నిరోధక టీకా శిబిరం, జుజాల్పూర్ లో ఎస్ఆర్ఈజీఎస్ కింద 5 లక్షల నిధులతో సిసి రోడ్లు శంకుస్థాపన, మూడు గుంటలు (జూకల్), పాలశీతలికరణ పాడి రైతుల అవగాహన సదస్సు కార్యక్రమాలకు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. జుజాల్పూర్ లో ఎస్ఆర్ఈజీఎస్ కింద 5 లక్షల నిధులతో సిసి రోడ్లు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని 5 గ్యారెంటీ అమలు చేస్తున్నామని అన్నారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు మా ప్రభుత్వం ద్వారా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమలలో డాక్టర్ నేతాజీ , మాజీ ఎంపీటీసీ పండరీ రెడ్డి గారు మండల నాయకులు రమేష్ చౌహాన్ గారు , మాజీ దత్తు గౌడ్ గారు, మాజీ సర్పంచ్ రాజు , రామ్ రెడ్డి , విట్టల్ రెడ్డి , చంద్ర రెడ్డి గ్రామ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు

'తాగునీటి సమస్య రాకుండా చూడాలి'





నవతెలంగాణ -మునిపల్లి

ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకముందే తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని మేళసంఘం గ్రామ శివారులోని గ్రామంలో గత కొన్ని నెలలుగా మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ అవుతుందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పైప్ లైన్ లీకేజ్ మరమ్మతులు చేపట్టలేదని గ్రామస్తులు అంటున్నారు, అసలే ఎండాకాలం దానికి తోడు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తగ్గుతున్న భూగర్భ జలాల దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు, ఈ విషయమై నవ తెలంగాణ విలేఖరి ఏఈ ఆర్ డబ్ల్యూ ఎస్ అంగత్ కు వివరణ కోరగా ఇప్పటివరకు లీకేజ్ విషయం తెలియదని త్వరలో లీకేజ్ కాకుండా రెండు చోట్ల మరమ్మతులు చేపడతామని అన్నారు.

గాలి అనిల్ కుమార్‌కు నాయకుల సన్మానం



నవతెలంగాణ -మునిపల్లి

జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను శుక్రవారం వాట్పల్లిలోని పోతులబొగుడలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ నివాసంలో మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా అనిల్ కుమార్ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. అనిల్ కుమార్‌ను సన్మానించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, పైతర సాయికుమార్, మండల నాయకులు శివశంకర్,. భాస్కర్, శంకర్, తాటిపల్లి మల్లేశం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మహిళా గ్రామ అధ్యక్షురాలిగా మంజుల

నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా గంగుల మంజులను నియమించినట్లు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గంగుల మంజుల. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా అనేక సంవత్సరాలుగా సేవలందిస్తుందని ఆమె సేవలను గుర్తించి గ్రామ మహిళ అధ్యక్షురాలుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

నేటి మహిళా సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో శనివారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని గాంధీ సెంటినరీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహిళా సదస్సుకు ముఖ్య వక్తలుగా డాక్టర్ ఎ. విజయ లక్ష్మి కోవిడ్ తర్వాత మహిళల ఆరోగ్యం, హార్మోన్స్ ఇన్ బ్యాలెన్స్ సమస్యలు, సలహాలు, సూచనలు పై సహజ ఫౌండేషన్ ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ శైలజ విస్సమ్ షెట్టి ప్రముఖ పేరెంటింగ్ కోచ్ టి. విజయ లక్ష్మి సమాజం, యువత, మహిళలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలు, సలహాలు, సూచనలు అనే అంశం మీద ప్రసంగిస్తారు.

ఆసుపత్రి వద్ద అల్పాహారం పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలోయ చేపడుతున్న అల్పాహార పంపిణీ శుక్రవారం 259



రోజులకు చేరుకుంది. లయన్ జగ్గయ్య శ్రీనివాస్ గౌరీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో అల్పాహారంతో పాటు బిర్యానీ. అరటి పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం ప్రభుత్వ దవాఖానలో అల్పాహారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. లయన్ జగ్గయ్య శ్రీనివాస్ గౌరీ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ధార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి అంజయ్య స్వామి, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్,తోట బిక్షపతి, నాగేందర్, దోంతుల సత్యనారాయణ, దూబకుంట లచ్చులు, రాములు, శ్రీధర్, రాజు, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు సమకూర్చి అభివృద్ధికి శంకుస్థాపనలు

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కవ్వంపల్లి



నవతెలంగాణ-బెజ్జంకి

గత ప్రభుత్వం నిధుల్లేక విస్మరించిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వార నిధులు సమకూర్చి శంకుస్థాపనలు చేపడుతున్నామని మాన కొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద రూ.కోటి రుపాయలతో చేపట్టనున్న సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్థానిక ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రతిష్టను కాపాడేల ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. అంతకుముందు దాచారం గ్రామంలో ప్రజల దాహర్తిని తీర్చడానికి నిర్మించిన నూతన ఉపరితల నీటి సరఫరా ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి, గాగీల్లపూర్, బేగంపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాయకులు రత్నాకర్ రెడ్డి, దామోదర్, పోచయ్య ప్రవీన్, మల్లేశం, నర్సయ్య, ప్రభాకర్, ఆలయ చైర్మన్ రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. హుస్నాబాద్ పట్టణంలో వడ్డేపల్లి రమణ కూతురు శ్రీజ, గడిపే లక్ష్మి మృతి చెందాగా కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి మనో ధైర్యాన్ని కల్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, కౌన్సిలర్ బొజ్జ హరీష్, చిట్టి గోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగం మధుసూదన్ రెడ్డి, ఐలేని మల్లికార్జున్ రెడ్డి, వైస్ చైర్మన్ అనిత రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని రైతు వేదికలో ఎంపీడీవో జయరాం ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటుకు సంబంధించి వివో అధ్యక్షులు, వివోఏ, సిఏలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయరాం, ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉండేటువంటి ప్రైమరీ, సెకండరీ పాఠశాలలకు సంబంధించి కమిటీ నెంబర్లు, అధ్యక్షులు, చైర్మన్‌లను ఎన్నుకోవాలన్నారు. ప్రైమరీ పాఠశాలలో 15 మంది కమిటీ నెంబర్లు ఉంటే వారికి వివో అధ్యక్షురాలు చైర్మన్ గా ఉంటారని, ప్రధానోపాధ్యాయులు కన్వీనర్ గా ఉంటారని తెలియజేశారు. వీరంతా కలిసి పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్మాణాలు, తాగునీటి సమస్యలు,ఏవైనా మరమ్మతు పనులు, పనిచేయని టాయిలెట్ మరమ్మతులు, తరగతి గదుల్లో విద్యుదీకరణ, పాఠశాలలో ప్రాంగణంలో పారిశుద్ధ్యం, అలాగే విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ ప్యానల్, అలాగే యూనిఫామ్ లు కుట్టించడం వంటి నిర్వహణ పనులు నిర్వహించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కవి కుమార్, ఏఈపిఆర్, సీసీలు , సిఆర్ పిలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి పర్యటన

నవతెలంగాణ-తొగుట

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి రానున్నారని ఎంపీపీ గాంధారి లత నరేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం మండలంలోని తుక్కాపూర్ పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వొకేషనల్ కళాశాలల ప్రహారీ గోడకు భూమి పూజ చేసేందుకు రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.